ప్రశాంతి నిలయంలో క్రిస్మస్ వేడుకలు ప్రారంభం





క్రిస్మస్ ట్రీని ప్రారంభిస్తున్న ఆర్జే రత్నాకర్

పుట్టపర్తి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రశాంతినిలయంలో గురువారం రాత్రి క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. సాయికుల్వంత్ సభా మండపంలో భజన అనంతరం గణేశ్ గేటు వద్ద 35 అడుగుల ఎత్తైన క్రిస్మస్ ట్రీని సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ ప్రారంభించారు. ఈ ఏడాది క్రిస్మస్‌కు వారం రోజుల ముందే వేడుకలు ప్రారంభమయ్యాయి. రాత్రి ప్రశాంతి నిలయంలోని పలు భవనాలను విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. శాంటా క్లాజ్ బొమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. క్రిస్మస్ ప్రారంభ వేడుకల్లో దేశవిదేశాలకు చెందిన వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం



పరిశ్రమల శాఖ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

పుట్టపర్తి టౌన్, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే వారికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం సాయంత్రం పరిశ్రమల శాఖ, ఏపీఐఐసీ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూమిని కేటాయించి, మౌలిక సదుపాయాలు, విద్యుత్ సౌకర్యం కల్పించడంతోపాటు అన్ని అనుమతులు త్వరగా మంజూరు చేస్తామన్నారు. పారిశ్రామిక వేత్తలతో అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా పారిశ్రామిక వాడల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. జిల్లాలో చిన్న తరహా పరిశ్రమలను ప్రోత్సహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సుహానసోని పాల్గొన్నారు.

రబీ సాగుకు సన్నద్ధం



ఉత్సాహంగా పొలం పనులు
టీబీ డ్యాంలో నీటి నిల్వపై రైతుల హర్షం

6

■ రెండోరోజు కొనసాగిన పోలీసు క్రీడాపోటీలు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

పుట్టపర్తి రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పోలీసు క్రీడాపోటీలు ఉల్లాసంగా, ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. రెండోరోజు గురువారం జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ మైదానంలో పోటీలు నిర్వహించారు. ఎస్పీ రత్న పోటీల్లో పాల్గొంటూ ఉత్తేజపరిచారు. మహిళా పోలీసులతో టెన్నీకాయట్ ఆడారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, డీఎస్పీలు విజయ్‌కుమార్, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.



టెన్నీకాయట్ ఆడుతున్న ఎస్పీ రత్న

హమ్మ.. ఉషా!



నియోజకవర్గం వైపు మాజీ మంత్రి చూపు
కార్యక్రమాలకు హాజరు అందుకేనా?
ఊతమిస్తున్న జగన్ వ్యాఖ్యలు
ముక్కోణపు పోరు తప్పదా?

పురం వైసీపీలో ముచ్చటగా మూడో వర్గం..!



హిందూపురం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వైసీపీ గెలిచింది లేదు. అయినా వర్గపోరు మాత్రం తగ్గట్లేదు. ఇప్పటికే రెండు వర్గాలు సై అంటే సై అంటున్నాయి. ముచ్చటగా మూడోవర్గం సిద్ధమవుతోందని సమాచారం. మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ.. పురంపై కన్నేసినట్లు చర్చలు వినిపిస్తున్నాయి. ఆమె రాజకీయ వ్యూహాలు అందుకు బలాన్నిస్తున్నాయి. ఆమె గెలిచిన నియోజకవర్గంలో ప్రజాదరణ పొందలేకపోయారన్న విమర్శలున్నాయి. అక్కడ పోటీచేస్తే ఘోర పరాజయం తప్పదని సార్వత్రిక ఎన్నికలకు కొన్ని రోజుల ముందు జిల్లాలోని పెనుకొండకు వలస వచ్చారు. పార్టీలో పెద్దాయనగా పేరుగాంచిన నాయకుడి అండతో పెనుకొండలో పాగావేశారు. అక్కడ కూడా సొంత పార్టీ నాయకుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఎమ్మెల్యేగా పోటీచేసి సవిత చేతుల్లో ఘోరంగా ఓడిపోయారు. అయినా పార్టీలో ఒక నాయకుడి అండతో జిల్లా అధ్యక్షురాలి స్థానాన్ని సంపాదించుకోగలిగారు. ఆమె సమన్వయ కర్తగా ఉన్న పెనుకొండలో అధికారం లేకపోయినా వర్గపోరు తగ్గలేదు. ఈ పరిస్థితుల్లో ఆమె బెంగళూరుకు దగ్గరగా ఉంటుందనో, వేరే ఆలోచనో తెలియదుగానీ పక్క నియోజకవర్గంపై కన్నేసినట్లు చర్చ మొదలైంది. ఆమె ఎమ్మెల్యేగా గెలుపొందిన నియోజకవర్గంతోపాటు ఈ ఏడాది జరిగిన ఎన్నికల్లో పోటీచేసిన నియోజకవర్గంలో సొంత పార్టీ కార్యకర్తలు, నేతలపై అక్రమ కేసులు పెట్టి వేధించడంతోపాటు ఎదురు తిరిగిన నాయకులను పార్టీ నుంచి సస్పెండ్ చేయించడంలో దిట్ట అని వైసీపీ వర్గీయులే బహిరంగంగా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో హిందూపురంపై కన్నేయడం ఆ పార్టీ వర్గాల్లో తీవ్ర చర్చ సాగుతోంది.

కేసులు పెట్టించి.. వేధించడంలో దిట్ట

ఉషశ్రీ 2019 ఎన్నికల్లో కళ్యాణదుర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి, జగన్ క్యాబినెట్‌లో స్థానం సంపాదించారు. ఆమె నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెడతారని ఓటేసి గెలిపించిన వారు ఆశించారు. ఆమె అభివృద్ధిని పక్కనబెట్టి అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు మూటగట్టుకున్నారు. సొంతపార్టీ నేతలపై అక్రమ కేసులు బనాయించి, చుక్కలు చూపించారు. ఆ నియోజకవర్గంలో ఆమెకు వ్యతిరేకంగా కార్యకర్తలు రోడ్డెక్కే పరిస్థితి వచ్చింది. దీంతో వైసీపీ అధిష్టానం గుర్తించి కళ్యాణదుర్గం నుంచి ఆమెను ఎన్నికలకు కొన్నిరోజులు ముందు పెనుకొండ సమన్వయకర్తగా నియమించింది. ఇక్కడ ఎమ్మెల్యేగా ఉన్న శంకర్‌నారాయణను తప్పించి, అనంతపురం పార్లమెంటు స్థానానికి పంపించారు. అయినా ఆయన సోదరులు, వర్గీయులకు పెనుకొండపై మోజు తగ్గలేదు. ఈ పరిస్థితుల్లో ఎన్నికల ముందు నుంచీ ఉషశ్రీ, శంకర్‌నారాయణ వర్గీయుల మధ్య పోరు తారస్థాయికి చేరింది. ఎవరైనా శంకర్‌నారాయణకు అనుకూలంగా మాట్లాడితే వారిపై ఉషశ్రీ కక్షగట్టి పార్టీ నుంచి పంపించడానికి కూడా వెనుకాడరని ఆ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఇటీవల గోరంట్ల మండలంలో శంకర్‌నారాయణ వర్గీయులను సస్పెండ్ చేయడమే ఇందుకు నిదర్శనం. దీంతో ఆమెపై ఆ రెండు నియోజకవర్గాల శ్రేణులు విసిగిపోయారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పక్క నియోజకవర్గమైన పురంపై కన్నేసినట్లు తెలుస్తోంది.

కుంపటితో కొట్టుమిట్టాడుతూ..

హిందూపురం నియోజకవర్గంలో వైసీపీ ఆవిర్భావం నుంచి వర్గపోరు తగ్గలేదని చెప్పవచ్చు. 15ఏళ్లుగా వైసీపీలో రెండు, మూడు వర్గాలు ఉంటూనే వస్తున్నాయి. ఇన్‌చార్జిగా ఎవరు ఉన్నా ఆ వ్యక్తికి వ్యతిరేకంగా రెండు వర్గాలు పనిచేయడం షరా మామూలే. ప్రస్తుతం ఒక వర్గానికి పెద్దాయన అండగా నిలుస్తుండగా.. మరోవర్గానికి వైసీపీలో కీలకనేత మద్దతు ఉన్నట్లు చెప్పుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో ఉషశ్రీ హిందూపురం వైపు చూస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుత సమన్వయకర్త దీపిక కురుబ సామాజికవర్గానికి చెందినవారు కాగా.. ఆమె భర్తది రెడ్డి సామాజికవర్గం. అలాగే ఉషశ్రీ కురుబ సామాజికవర్గం కగా.. భర్త రెడ్డి. దీంతో ఆమె ఇక్కడికి



వచ్చినా అధిష్టానానికి ఎలాంటి ఇబ్బందులు ఉండవనీ, సామాజికవర్గాల పరంగా కుదుటపడవచ్చని పార్టీ పెద్దలు దృష్టి సారించినట్లు సమాచారం. ఇప్పటికే ఆమె హిందూపురం నియోజకవర్గంలో ద్వితీయశ్రేణి నాయకులతో టచ్‌లో ఉన్నట్లు ఇక్కడ చెప్పుకుంటున్నారు. నియోజకవర్గం సేఫ్ అని ఆమె భావిస్తున్నారు. ఒకటి మాత్రం గుర్తించలేకపోతున్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు ఒక్కసారి కూడా వేరేపార్టీ పురంలో ఖాతా తెరవలేదు. 11 సార్లు తెలుగుదేశం అభ్యర్థులే ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. ఏదిఏమైనా మాజీ మంత్రి హిందూపురం వైపు చూస్తున్నారని ఆ పార్టీలో సమాచారం చక్కర్లు కొడుతోంది. ఆమె ఇక్కడికి వస్తారా.. లేదా.. అన్నది వేచి చూడాలి.

ముందుచూపుతోనే..

ఉషశ్రీ బెంగళూరులో నివాసం ఉంటున్నారు. హిందూపురం నియోజకవర్గం అయితే బాగుంటుందని భావించినట్లు సమాచారం. అందులో భాగంగానే నియోజకవర్గంలో నిర్వహించే పార్టీ కార్యక్రమాలకు హాజరవుతున్నారు. వైసీపీ నాయకులకు అండగా ఇటీవల జరిగిన కార్యక్రమాల్లో ఆమె నేరుగా పాల్గొని, పోలీసు అధికారులపై రుసరుసలాడారు. వీటిని బట్టి చూస్తే ఆమె హిందూపురంపై కన్నేసి ఉండవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. వైసీపీలో మూడువర్గాలుగా విడిపోయి ఎవరికి వారుగా కార్యక్రమాలు చేస్తున్నారు. గత నెలలో హిందూపురం నియోజకవర్గంలో విభేదాలు చక్కదిద్దేందుకు వైసీపీ నాయకులు సతీష్‌రెడ్డి, ఉషశ్రీ వచ్చారు. ఆరోజు ఒక వర్గాన్నే కలిసి అభిప్రాయాలు తెలుసుకుని అధిష్టానానికి నివేదించారు.



ఆ తరువాత హిందూపురం నియోజకవర్గంలోని ముఖ్య నాయకులను తీసుకెళ్లి, జగన్మోహన్‌రెడ్డితో కలిశారు. ఆరోజు నవీన్‌నిశ్చల్ వైపు కొంతమంది నాయకులు బలంగా వాణి వినిపించినట్లు సమాచారం. ప్రస్తుత ఇన్‌చార్జి దీపిక నియోజకవర్గంలో ఎన్నిరోజులుంటారని అడగ్గా.. వారంలో మూడు, నాలుగు రోజులు ఉంటున్నట్లు చెప్పారు. ఈ పరిస్థితుల్లో రెండు వర్గాలను సమన్వయం చేసుకుని ఏకతాటిపైకి రావాలని జగన్ ఆదేశించారు. అయినా వారు ఖాతరు చేయలేదు. పరస్పరం ఫిర్యాదులు చేసుకుంటున్నారు. ఇలాగే ఉంటే కొత్త వ్యక్తిని అక్కడికి పంపుతారని తెలుస్తోంది. ఈ పరిణామాలను బట్టి చూస్తే ఉషశ్రీ హిందూపురం వైపు చూస్తున్నారన్న అంచనాకు వచ్చినట్లు వైసీపీ నాయకులే పేర్కొంటున్నారు.

కలుపు కష్టం!



వేరుశనగలో కలుపు తీస్తున్న కూలీలు

వేరుశనగ రైతుకు కొత్త కష్టం వచ్చిపడింది. ఖరీఫ్‌లో వర్షాభావంతో పంట నష్టపోవాల్సి వచ్చింది. రబీలో బోర్లకింద పంట పెట్టిన రైతులకు కలుపు కష్టం వచ్చిపడింది. ఇటీవలిగా కురుస్తున్న వరుస వర్షాలతో పైరులో కలుపు విపరీతంగా పెరిగిపోతోంది. ఎండ లేకపోవడంతో తెగులు సైతం సోకుతున్నాయి. కలుపు తొలగిస్తే తప్ప.. పంట దక్కే పరిస్థితి లేదు. కలుపు తీయిద్దామంటే కూలీల కొరత వేధిస్తోంది. పక్క ఊళ్లకు వెళ్లాల్సి వస్తోంది. కూలి ధరలు విపరీతంగా ఉంటున్నాయి. కూలీలను తీసుకు రావడనానికి, వదలడానికి వాహనాలను సమకూర్చాల్సి వస్తోంది. ఆ ఖర్చు రైతుకు అదనపు భారమవుతోంది. ఎకరాలో కలుపు తొలగించేందుకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ఖర్చవుతోందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

- ఆంధ్రజ్యోతి, నంబులపూలకుంట

వేరుశనగ పైరులో విపరీతంగా గడ్డి

వరుస వర్షాలతో పెరిగిపోతున్న వైనం
తొలగిద్దామంటే దొరకని కూలీలు
అధిక కూలి ధరలతో రైతు బెంబేలు
వదిలేస్తే పంట దక్కదన్న ఆందోళన

ఇతర ప్రాంతాల నుంచి రావాల్సిందే..


మండల వ్యాప్తంగా 2,500 ఎకరాల్లో వేరుశనగ సాగుచేశారు. 15నుంచి 30రోజుల వయసు ఉన్న పంటకు చీడపీడలు అధికంగా సోకాయి. నెలరోజుల్లో మూడు తుఫాన్లు రావడంతో విత్తినప్పటి నుంచి వర్షం కురుస్తూనే ఉంది. దీంతో కలుపు అధికమైంది. దానిని తొలగిస్తే తప్ప.. పంట చేతి కొచ్చేలా లేదు. అప్పోసప్పో చేసి, కలుపు తీసుకోవడానికి రైతులు సిద్ధమవుతున్నారు. అసలే కూలీల కొరత ఉండడంతో, బయట గ్రామాలనుంచి తీసుకురావాలంటే రవాణా ఖర్చు కూడా రైతులే భరించాల్సి ఉంటుంది. వారంరోజులుగా తుఫాను ప్రభావంతో రోజంతా మబ్బులు కమ్ముకుంటున్నాయి. చిరుజల్లులు కురుస్తుండడంతో కలుపు మరింత ఎక్కువవుతోందనీ, కూలీల ఖర్చు ఎంత అయినా ఇచ్చి కలుపు తీయడానికి రైతులు మొగ్గు చూపుతున్నారు.

వేరుశనగకు చీడపీడలు

విత్తనాలను శుద్ధి చేసుకుని విత్తాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. రైతులు నిర్లక్ష్యం చేయడంతో వేరు, కాండం కుళ్లు సోకి మొక్కదశలోనే చనిపోతున్నాయి. అధికంగా కలుపు ఉండడంతో రసం పీల్చే పురుగు ఆశించి, వేరుశనగ ఆకులకు రంధ్రాలు పెడుతున్నాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, ఎండ లేకపోవడం, భూమిలో జింకులోపంతో ఆకులపై నల్లని మచ్చలు ఏర్పడాయి. ఎండ లేకపోవడంతో మందులు పిచికారీ చేసినా ఫలితం ఉండదని రైతులు అంటున్నారు. రోజులు గడిచేకొద్దీ దక్కే పరిస్థితి కనిపించట్లేదని వాపోతున్నారు. కొన్నిచోట్ల 30 నుంచి 45రోజుల వయసున్న వేరుశనగకు ఆకుముడత, లైట్ ఎల్లో రంగులోకి ఆకులు మారడం ద్వారా కూడా రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



కలుపు అధికంగా ఉన్న వేరుశనగ పైరు



పంటకు సోకిన వేరుపురుగు

ఎకరాకు రూ.30వేలు ఖర్చు చేశా

రబీలో ఐదెకరాల్లో వేరుశనగ సాగుచేశా. ఎకరాలో పంట పెట్టేందుకు రూ.30వేలు పెట్టుబడి పెట్టా. విత్తనాలకు రూ.15వేలు, దుక్కికి రూ.5వేలు, సాగు ఖర్చులకు రూ.5వేలు, కలుపు తొలగించేందుకు రూ.10వేలు ఖర్చు చేశా. ఐదెకరాలకుగాను ఇప్పటికే రూ.1.50 లక్షలు వెచ్చించా. పంట నెలరోజులు కూడా పూర్తి చేసుకోలేదు. మూడునెలలు దాటితే తప్ప.. పంట రాదు. పంటను తెగులు ఆశిస్తున్నాయి. ఎలా కాపాడుకోవాలో అర్థం కావట్లేదు.

- హనుమంతరెడ్డి, రైతు, జౌకల



నివారణ చర్యలు చేపట్టాలి

విత్తన శుద్ధి చేసుకోవాలి. వేరు, కాండం కుళ్లు సోకిన పంటకు కాపర్ ఆక్సీక్లోరైడ్ గానీ, ఎక్సకోలజోన్ 2 ఎం.ఎల్.. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. రసం పీల్చే పురుగు నివారణకు ఇమిడాక్లోఫిడ్ వంద ఎం.ఎల్, నీమ్‌ఆయిల్ లీటరును 200 లీటర్ల నీటిలో కలిపి, ఎకరాకు పిచికారీ చేసుకోవాలి. 30నుంచి 40రోజుల సమయంలో రెండో తవ్వకం తరువాత ఎకరాకు 200 కేజీల జిప్సం, పూత దశలో పొటాషియం నైట్రేట్ 13-0-45 పిచికారీ చేయాలి. ఇనుప ధాతు లోపంతో లైట్ ఎల్లో రంగులోకి ఆకులు మారుతాయి. దీని నివారణకు పెర్సస్పైట్ 2గ్రా., లీటరు నీటిలో కలిపి, పిచికారీ చేసుకోవాలి.



- లోకేశ్వర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి, నంబులపూలకుంట

తిరుమలలో వివక్షకు తావు లేదు

టీటీడీ సభ్యుడు ఎంఎస్ రాజు



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర టౌన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉనికి కోసం కొందరు తిరుమల తిరుపతి దేవస్థానంపై అభాండాలు వేస్తున్నారని, కొండపై ఎలాంటి వివక్షకు తావు లేదని టీటీడీ బోర్డు సభ్యుడు, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ఉనికిని కాపాడుకునేందుకు టీటీడీపై మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, ప్రాంతీయ భావనతో మాట్లాడటం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. తిరుమల వెంకటేశ్వరస్వామి దర్శనం కోసం ప్రతి రోజు 65 వేల నుంచి 80 వేల మంది భక్తులు వస్తున్నారని, దేశ విదేశాల నుంచి స్వామిని దర్శించుకునేందుకు వస్తున్నారని అన్నారు. కులం, ప్రాంతాలకు సంబంధం లేకుండా వచ్చిన భక్తులు అందరూ స్వామివారిని దర్శించుకుని వెళుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో బీఆర్ నాయుడు గారి నాయకత్వంలో తిరుమలలో ఎటువంటి వివక్షకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రాంతీయ పార్టీ నుంచి వచ్చిన శ్రీనివాస గౌడ్ వారి పార్టీ ఉనికి కోసం, ఆవేశంలో దేవుడి వద్ద రెండు రాష్ట్రాల ప్రజలు, వెంకటేశ్వరస్వామి భక్తుల మనోభావాలు దెబ్బతినేలా రాజకీయాలు మాట్లాడటం న్యాయం కాదన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, నాయకులు పాల్గొన్నారు.

జైలులో పరిశుభ్రత పాటించండి

దీర్ఘకాలిక వ్యాధులపై నిర్లక్ష్యం వద్దు
జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్

హిందూపురం/పెనుకొండ/ ధర్మవరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): జైలులో పరిశుభ్రత పాటించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్ సూచించారు. హిందూపురం, పెనుకొండ, ధర్మవరం సబ్‌జైళ్లను గురువారం తనిఖీ చేశారు. న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి మాట్లాడుతూ.. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న నిందితుల పట్ల నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించాలన్నారు. జైలులో ఉన్న వారి వివరాలు ఆరాతీశారు. 60ఏళ్లు దాటిన ఖైదీల సమాచారాన్ని వెంటనే న్యాయస్థానానికి తెలపాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో న్యాయవాదులు, జైళ్ల సిబ్బంది పాల్గొన్నారు.



ధర్మవరం సబ్‌జైలులో గదిని పరిశీలిస్తున్న న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్

మామిడి పంటలో సస్యరక్షణ చర్యలు అవసరం

జిల్లా ఉద్యాన శాఖాధికారి చంద్రశేఖర్



జిల్లా ఉద్యాన శాఖాధికారి చంద్రశేఖర్

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మామిడి తోటల్లో రైతులు ప్రస్తుతం సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి చంద్రశేఖర్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ప్రస్తుతం మామిడి పంట పూత ఏర్పడే దశలో ఉందన్నారు. ఇటీవల వర్షాలు కురిసినందున రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పూతమొగ్గలు తొందరగా ఒకేసారి రావడానికి 13:0:45 రకం 7 గ్రాములు ప్లస్ ఏదేని సూక్ష్మధాతువు 2 గ్రాముల నుంచి 3 గ్రాములు... లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు. తేనెమంచు పురుగు ఆగుపిస్తే తోటలో ఇమిడాక్లోప్రిడ్ 0.3 ఎంఎల్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాల్సి ఉంటుందన్నారు. వర్షాలుపడి నిలిచిపోయిన తర్వాత మంచు ఏర్పడటం కారణంగా పూత నల్లగా మారిపోయి పిందెకట్టకుండా రాలిపోయే అవకాశం ఉన్నందున లీటరు నీటికి కార్బండిజమ్ 1గ్రాము, ఎం-45 2.5 గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు. ప్రస్తుతం పూమొగ్గలు గమనించనట్లయితే బ్రాసినోలిడ్ 0.5 ఎంఎల్ లీటరు నీటికి కలిపిగానీ, నాఫ్తలిన్ యాసిడ్ 3ఎంఎల్ 10 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ఇలా చేయడం ద్వారా మామిడిలో మంచి దిగుబడులు సాధించవచ్చని ఆయన వివరించారు.

బాలుడిని మింగిన నిర్లక్ష్యం..!
మురుగు గుంతలో తేలిన శవం..
7
సొంతింటి కోసం చోరీలు



తూట్రాళ్లపల్లిలో..



కూలితే ఎంత ప్రమాదమో..?

కూలేందుకు సిద్ధంగా..

తూట్రాళ్లపల్లిలో ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాలు

యాడికి, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూట్రాళ్లపల్లి గ్రామ సమీప వ్యవసాయ పొలాల్లో విద్యుత్‌స్తంభాలు ఒకవైపు ఒరిగిపోతున్నాయి. దీంతో ఎప్పుడు ఏమి ప్రమాదం జరుగుతుందోనని రైతులు, అటువైపు వెళ్లే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ స్తంభాలు నేల కొరిగిన విషయాన్ని ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినా స్పందన లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే గాని అధికారులు స్పందించేలా లేరని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే రాయలచెరువులో రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో విద్యుత్ స్తంభానికి తీగలు అల్లుకొని ప్రమాదకరంగా మారింది. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ప్రమాదం జరగకముందే స్తంభాలను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.



రాయలచెరువులో...



తూట్రాళ్లపల్లి-నగరూరు మధ్య

డీఎంహెచ్‌ఓపై లోకాయుక్తకు ఫిర్యాదు

అనంతపురం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌ఓ) భ్రమరాంబికా దేవిపై లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. డీఎంహెచ్‌ఓగా బాధ్యతలు చేపట్టినినాటి నుంచి ఆమె చేసిన అవినీతి అక్రమాలపై నిగ్గు తేల్చాలని ఉరవకొండ సబ్ యూనిట్ మలేరియా అధికారి కోదండరామిరెడ్డి లోకాయుక్తకు ఇచ్చిన ఫిర్యాదులో కోరారు. గురువారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ వైద్యఆరోగ్యశాఖలో పనిచేసే సిబ్బందికి ఆర్థిక పరమైన అంశాలకు సంబంధించిన పత్రాలపై సంతకాలు చేయాలంటే డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. డబ్బులిస్తే సంతకాలు చేస్తున్నారని, లేనిపక్షంలో చేయడం లేదని వాపోయారు. ఈ అంశాలతోపాటు అనేక అవినీతి ఆరోపణలకు సంబంధించి లోకాయుక్తకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసి ఆధారాలను అందజేశానన్నారు. వాటిపై సమగ్రంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని లోకాయుక్తను కోరినట్లు కోదండరామిరెడ్డి తెలిపారు.



ఆగిపోయిన షాదీఖానా నిర్మాణ పనులు

నిర్లక్ష్యానికి నిదర్శనాలు



పిల్లర్ దశలో ఉన్న ఇండోర్ స్టేడియం

ఉరవకొండ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనంగా పట్టణంలోని ముస్లిం షాదీఖానా, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఇండోర్‌స్టేడియం దర్శనమిస్తున్నాయి. మైనార్టీశాఖ ఆధ్వర్యంలో 2019లో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో రూ.40లక్షలతో షాదీఖానా నిర్మాణం పనులు చేపట్టారు. అప్పట్లో రూ.20లక్షల పనులు కూడా పూర్తి చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మిగిలిన నిధులు మంజూరు కాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. వైసీపీ పాలనలో అప్పటి మైనార్టీ శాఖమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. అలాగే 2018లో రూ.2కోట్లతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇండోర్ స్టేడియం నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. రూ.10లక్షల వ్యయంతో శ్లాబ్ స్థాయివరకూ పిల్లర్ నిర్మాణం చేపట్టారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఆ నిర్మాణాన్ని ఆపేసింది. అప్పటి నుంచి ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదు.

రబీ సాగుకు సన్నద్ధం

ఉత్సాహంగా పొలం పనులు
టీబీ డ్యాంలో నీటి నిల్వపై రైతుల హర్షం



బొమ్మనహాళ్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో కురిసిన వర్షాలతో నీరు సమృద్ధిగా లభిస్తుండడంతో రైతులు రబీ సాగుకు సన్నద్ధమవుతున్నారు. గతంలో ఖరీఫ్‌లో వర్షాలు లేక నారుకు ట్యాంకర్ల ద్వారా, బిందెలతో తడిపిన సందర్భాలు ఉన్నాయి. ఈ ఏడాది మంచి వర్షాలు కురిసి తుంగభద్ర జలాశయం, చెరువులు నిండడంతో రైతులు రబీలో వివిధ రకాల పంటలు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఖరీఫ్‌లో వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటలు వర్షానికి దెబ్బతిని రైతులు నష్టపోయారు. ఆ నష్టాల నుంచి కోలుకునేందుకు రబీకి సిద్ధమవుతున్నారు. వరి సాగుకు రైతులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. బొమ్మనహాళ్ మండలంలో ఖరీఫ్ వరి సాగు తుదిదశకు చేరుకుంటోంది. రైతులు వరి కోతలు చేపడుతున్నారు. కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి రావటంతో ధాన్యం ఆరబోసి కాటాలు వేసి మిల్లులకు తరలిస్తున్నారు. స్థానికంగా నాణ్యమైన విత్తనాలు లేక రైతులు కర్ణాటకలోని కంప్లి, గంగావతి తదితర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి నారు సాగు చేసుకున్నారు. మండల పరిధిలోని లింగదహాళ్, రంగాపురం క్యాంప్, శ్రీధరఘట్ట, గోనేహాళ్, ఉద్దేహాళ్ తదితర గ్రామాల్లో వరి సాగు సన్నద్ధమవుతున్నారు. ఖరీఫ్ కోతలు పూర్తి కాకుండానే తక్కువ కాలంలో వచ్చే నారు చల్లుకున్నారు. ఖరీఫ్‌లో 17 వేల ఎకరాలపైగా వరి పంట సాగు చేశారు. రబీలో 12 వేల ఎకరాల్లో సాగుకు సిద్ధమవుతున్నారు.

రెండోసారి వరి సాగు చేస్తున్నా

నాకు ఉన్న ఆరు ఎకరాల పొలంలో నాలుగు ఎకరాల్లో వరి, రెండు ఎకరాల్లో పత్తి పంటను సాగు చేస్తున్నాను. ఇప్పటికే వరి నారు పోసుకున్నాను. ఖరీఫ్‌లో వరి పంట సాగు చేస్తే ఎకరాకు 45 బస్తాలు దిగుబడి వచ్చింది. ధర లేకపోవడం వల్ల పెద్దగా లాభం లేదు. తుంగభద్ర జలాశయంలో నీరు ఉండడం, వ్యవసాయ బోర్ల కింద రెండోసారి పంటల సాగుకు సిద్ధం చేసుకుంటున్నాను.



- తిప్పేస్వామి, లింగదహాళ్

రెండో పంటకు సాగునీరివ్వాలి



ఖరీఫ్‌లో ఎనిమిది ఎకరాల్లో వరి పంట సాగు చేస్తే కోత సమయంలో నేలకొరిగి రూ. 40 వేలు నష్టం జరిగింది. రెండో పంటకు బోరుబావులు కింద వరిపంట సాగుకు సిద్ధం చేసుకుంటున్నాం. ఇప్పటికే వరినారు పోసుకున్నాం. తుంగభద్ర జలాశయంలో నీరు ఉన్నాయి. రెండో పంటకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. రబీసీజన్‌లో వరి పంట బాగా పండితే మా పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తా.

- రాము, ఉప్పరహాళ్ క్రాస్

సాగుకు నారు సిద్ధం చేశా..



రబీసీజన్‌లో 10 ఎకరాల్లో వరిసాగుకు నారు పోసుకున్నాం. నా సొంత భూమితో పాటు మరికొంత కౌలుకు చేస్తున్నా. వర్షం వల్ల కొంత వరకు పంట నష్టం జరిగింది. పంట నమోదు కాలేదని ఈసారి ఖరీఫ్‌లో సాగు చేసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయలేదు. బయటి వ్యాపారులకు ధాన్యం విక్రయించాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రభుత్వ ధర కన్నా తక్కువకు విక్రయించాను. పంట నమోదు కాని రైతుల ధన్యాం కూడా కొనుగోలు చేస్తే బాగుండేది.

- రామాంజనేయులు, ఉద్దేహాళ్

ప్రత్యామ్నాయ పంటలతో అధిక దిగుబడులు



రబీలో వరి పంట బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు వస్తాయి. రైతులు లాభదాయక పంటలను గుర్తించుకుని సాగుచేయాలి. ముఖ్యంగా వ్యవసాయశాఖ అధికారులు సూచనలు, సలహాలు తీసుకుని రబీలో పంటలు సాగు చేయాలి. ఆరుతడి పంటలు సాగుచేస్తే అధిక లాభాలు పొందవచ్చు.

- సాయికుమార్, ఏఓ, బొమ్మనహాళ్



వేరుకుళ్లు తెగులు సోకి ఎండిపోతున్న పప్పుశనగ పంట

పప్పుశనగకు వేరుకుళ్లు దెబ్బ

బెళుగుప్ప, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రబీలో సాగు చేసిన పప్పుశనగ పంటకు వేరుకుళ్లు తెగులు సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నల్లరేగడి భూముల రైతులకు ఈ పంటే జీవనాధారం. సాగు చేసి రెండు నెలలు గడుస్తుండడంతో పంట పూత దశలో ఉంది. ఈ యేడాది మండల వ్యాప్తంగా 16,600 ఎకరాల్లో సాగు చేశారు. వర్షాలు బాగా కురవడంతో పైర్లు ఏపుగా పెరిగాయి. పైరు కళకళలాడుతుండడంతో దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని ఆశించిన రైతులకు తెగులు ఆందోళన కలిగిస్తోంది. వేరుకుళ్లు తెగులు సోకి మొక్కలన్నీ నల్లబారి చనిపోతున్నాయి. నివారణకు వేలాది రూపాయలు వెచ్చించినా పంటంతా నాశనమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుఫాను ప్రభావంతో పంట దెబ్బతింటుందని ఒక వైపు దిగులు పడుతుండగా.. తెగులు సోకడంతో దిక్కుతోచని పరిస్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.

తెగుళ్లు నీరుగారుస్తున్నాయి



వర్షాలు బాగా కురిసి పైర్లు ఏపుగా పెరిగాయి. దిగుబడులు బాగావస్తాయని ఆశగా ఉన్నాం. ఈ పరిస్థితుల్లో వేరుకుళ్లు సోకి పైరంతా నాశనమవుతోంది. ఎంత ఖర్చు చేసినా ఉపయోగం లేకుండా పోతోంది. వాతావరణం అనుకూలిస్తేనే గట్టెక్కుతాం.

- దామోదర, రైతు, తగ్గుపర్తి

తేమశాతం అధికమై చనిపోతున్నాయి



భూమిలో తేమ శాతం అధికంగా ఉన్నందున వేర్లన్నీ నల్లబారి మొక్కలు చనిపోతున్నాయి. దీనికి పంట మార్పిడి చేయకపోవడం కూడా ఒక కారణం. సాఫ్ 400 గ్రాములు ఎకరానికి, ప్రోపికోనోజల్ 400 గ్రాములు ఎకరానికి, పైరు తడిచేలా పిచికారి చేయాలి. ఇది తాత్కాలిక ఉపశమనం మాత్రమే.

- పృథ్వీసాగర్, వ్యవసాయాధికారి, బెళుగుప్ప

ఉద్యోగోన్నతులు కల్పించాలి: ఈయూ



ప్రసంగిస్తున్న ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య

అనంతపురం కల్చరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో ఐదేళ్లుగా నిలుపుదల చేసిన ఉద్యోగోన్నతులను వెంటనే కల్పించాలని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని వీకే భవన్‌లో గురువారం నిర్వహించిన జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు. గత ప్రభుత్వం ఆర్టీసీ సిబ్బందికి నిలుపుదల చేసిన నైటవుట్ అలవెన్సులను చెల్లించేలా జీఓ జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలో ఆర్టీసీ ఉద్యోగుల ఉద్యోగ భద్రతకోసం ఇచ్చిన సర్క్యులర్ నం.పీడీ-1/2019ను కొంతమంది అధికారులు పక్కన పెట్టారని, విపరీతంగా పనిష్మెంట్లు ఇస్తున్నారని అన్నారు. వెంటనే సర్క్యులర్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఈయూ జోనల్ అధ్యక్షుడు కేకే కుమార్, జిల్లా కార్యదర్శి పీయస్ ఖాన్, మహిళా నాయకురాలు నాగమణి, ఏఐటీయూసి జిల్లా అధ్యక్షుడు రాజేష్, ఏపీ జేఏసి అమరావతి జిల్లా అధ్యక్షుడు ఆర్ఎన్ దివాకర్, కొండయ్య, గోపాల్, ఓబుళరత్నం, రామాంజనేయులు, కల్లప్ప, ఉమ్మడి జిల్లాలోని అన్ని డిపోల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

'ఎన్ఎంయూఏతోనే సమస్యల పరిష్కారం'



రమణారెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎన్ఎంయూఏతోనే కార్మిక సమస్యలు పరిష్కారం అవుతాయని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమణారెడ్డి అన్నారు. వైసీపీ హయాం నుంచి ఆర్టీసీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న నైటవుట్ అలవెన్సులను చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎన్ఎంయూఏ నాయకులు రమణారెడ్డిని అనంతపురం ఆర్ఎం కార్యాలయం వద్ద గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ... కార్మికుల అనేక సమస్యలపై ఎన్ఎంయూఏ పోరాటాలు చేపట్టి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిందని అన్నారు. పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ నైటవుట్ అలవెన్సుల చెల్లిపుకోసం జీఓ జారీ చేసిందని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంయూఏ జిల్లా చైర్మన్ సూరిబాబు, కార్యవర్గ సభ్యులు ఆదినారాయణ, అనిత, ఈశ్వరప్ప, అనంతపురం డిపో కార్యదర్శి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా ప్రీమియం చెల్లింపునకు గడువు పొడిగింపు

అనంతపురం అర్బన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది రబీ సీజన్‌కు సంబంధించి పంటల బీమా ప్రీమియం చెల్లించేందుకు ఈనెలాఖరు దాకా గడువు పొడిగించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తుఫాన్, కరువు, అకాల వర్షం తదితర ప్రకృతి వైపరీత్యాల మూలంగా పంట దిగుబడి నష్టపోతే ఆర్థిక సాయం అందించడం జరుగుతుందన్నారు. వాతావరణ అంశాల ఆధారంగా సంభవించిన పంటనష్టాన్ని అంచనా వేసి బీమా పరిహారాన్ని చెల్లించడం జరుగుతుందన్నారు. వాతావరణ ఆధారిత బీమాకు సంబంధించి మామిడి పంటకు ఎకరాకు రైతు వాటా రూ.1650 చెల్లిస్తే రూ.33వేల బీమాను వర్తింపజేస్తారన్నారు. టమోటా పంటకు ఎకరాకు రూ.1600లు చెల్లిస్తే రూ.32వేల బీమాను వర్తింపజేస్తారన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద దిగుబడి ఆధారిత బీమాకు సంబంధించి వేరుశనగ పంటకు ఎకరాకు రూ.480లు చెల్లిస్తే రూ.32వేలు బీమా వర్తిస్తుందన్నారు. జొన్న పంటకు ఎకరాకు రూ.315లు చెల్లిస్తే రూ.21వేలు, మొక్కజొన్నకు ఎకరాకు రూ.525లు చెల్లిస్తే రూ.35వేలు, వరి పంటకు ఎకరాకు రూ.630లు చెల్లిస్తే రూ.42వేలు, పప్పుశనగ పంటకు ఎకరాకు రూ.450లు చెల్లిస్తే రూ.30వేల బీమా మొత్తాన్ని చెల్లించడం జరుగుతుందన్నారు. ఇదివరకు ఈనెల 15వతేదీ వరకు గడువు ఉండిందని, రైతుల సౌకర్యార్థం ఈనెలాఖరు దాకా ప్రభుత్వం గడువును పొడిగించిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఫైనల్స్‌కు ఎస్ఎస్‌బీఎన్.. బ్లూమూన్

అంతర్ కళాశాలల క్రికెట్ టోర్నీ

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ అంతర్ కళాశాలల క్రికెట్ పోటీలలో ఎస్ఎస్‌బీఎన్, కదిరి బ్లూమూన్ డిగ్రీ కాలేజీ జట్లు ఫైనల్స్‌కు చేరాయి. ఆర్డీటీ స్టేడియంలో గురువారం సెమీఫైనల్స్ నిర్వహించారు. తొలి పోరులో అనంతపురం వివేకానంద డిగ్రీ కళాశాల జట్టుపై కదిరి బ్లూమూన్ డిగ్రీ కాలేజీ జట్టు విజయం సాధించింది. నిర్ణీత 20 ఓవర్లలో కదిరి జట్టు 7 వికెట్లు కోల్పోయి 251 పరుగులు చేసింది. సాయిప్రణీత్ 162 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన వివేకానంద 8.4 ఓవర్లలోనే 71 పరుగులకు ఆలౌట్ అయింది. రెండో సెమీస్‌లో ఎస్ఎస్‌బీఎన్, ఎస్వీ డిగ్రీ కాలేజీ జట్లు తలపడ్డాయి. ఎస్ఎస్‌బీఎన్ నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 252 పరుగులు చేసింది. అర్జున్ టెండూల్కర్ 150, జయకృష్ణ 54 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన ఎస్వీ డిగ్రీ కాలేజి 7.3 ఓవర్లలో 108 పరుగులకు ఆలౌట్ అయింది. కదిరి బ్లూమూన్, ఎస్ఎస్‌బీఎన్ జట్ల మధ్య ఫైనల్ పోరు శుక్రవారం జరగనుంది. ఎస్కే యూనివర్సిటీ రెక్టార్ వెంకటనాయుడు, ఎస్వీ డిగ్రీ కాలేజీ చైర్మన్ సోమశేఖర్ రెడ్డి, ఎస్కేయూ స్పోర్ట్స్ సెక్రటరీ జెస్సీ క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ డిగ్రీ పీజీ కళాశాల వైస్ చైర్మన్ చక్రధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఏఓ శ్రీనాథ్, ఆర్గనైజింగ్ డైరెక్టర్ శ్రీనివాసులు నాయక్, పీడీలు శ్రీరామ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోండి



ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌ను ప్రారంభిస్తున్న సానా సతీష్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): దివ్యాంగ క్రికెట్ క్రీడాకారులు రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల కోసం ఆన్‌లైన్‌లో ఈనెల 20వతేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలని దివ్యాంగ క్రికెట్ ఆంధ్రా అసోసియేషన్ కన్వీనర్ రోషిరెడ్డి తెలిపారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను గురువారం అమరావతిలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సానా సతీష్ చేతుల మీదుగా ప్రారంభించారు. 20వ తేదీన పేర్ల నమోదు పూర్తి చేసి, 21న ఎంపిక ప్రక్రియ తేదీని ప్రకటిస్తామని తెలిపారు. వివరాల కోసం 9703400870, 7780167625, 6305354511 సెల్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆంధ్రా-19 మహిళా జట్టుకు అర్షియా, నేహా

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా-19 మహిళా జట్టుకు అర్షియా, నేహా ఎంపికయ్యారు. జనవరి 4 నుంచి త్రివేండ్రంలో నిర్వహించే జాతీయస్థాయి పోటీలలో వీరు పాల్గొంటారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఇన్‌చార్జి సెక్రటరీ భీమ లింగారెడ్డి వారిని అభినందించారు.



అర్షియా



నేహా

న్యూస్‌బాక్స్

రైళ్ల దారి మళ్లింపు

గుంతకల్లు, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): గుంతకల్లు-గుంటూరు లైన్ డబ్లింగ్ పనుల కారణంగా ఈ మార్గంలో వెళ్లే పలు రైళ్లను దారి మళ్లించినట్లు రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బుగ్గనపల్లి సిమెంట్ నగర్-పాణ్యం స్టేషన్ల మధ్య వర్కుల కారణంగా పూరి-యశ్వంతపూర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ (నం. 22883) రైలును 20వ తేదీన, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 22884)ను ఈనెల 21న, హౌరా-యశ్వంతపూర్ వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (నం. 22831) రైలును ఈనెల 25న, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 22832)ను ఈనెల 20న, భువనేశ్వర్-యశ్వంతపూర్ ఎక్స్‌ప్రెస్ (నం. 02811) రైలును ఈ నెల 21న, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 02812)ను ఈ నెల 23న డోన్-గుత్తి మీదుగా కాకుండా నంద్యాల, యర్రగుంట్ల, గుత్తి ఫోర్ట్, అనంతపురం/ధర్మవరం స్టేషన్ల మీదుగా మళ్లించనున్నట్లు తెలియజేశారు.

23 నుంచి న్యాయవిద్య పరీక్షలు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఆధ్వర్యంలోని న్యాయవిద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు 23నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు గురువారం కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేషన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్కేయూ క్యాంపస్ లా డిపార్ట్‌మెంట్‌తోపాటు విజయనగర లా కాలేజ్ విద్యార్థులకు ఏక కాలంలో పరీక్షలుంటాయన్నారు. వీరందరికీ ఎస్కేయూ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షాకేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఐదు సంవత్సరాల బీబీఏ, బీకామ్ ఎల్ఎల్‌బీ ద్వితీయ, నాల్గవ సెమిస్టర్ విద్యార్థులకు. ఎల్ఎల్ఎం ద్వితీయ సెమిస్టర్ విద్యార్థులకు పరీక్షలుంటాయని వివరించారు. అదేవిధంగా మూడు సంవత్సరాల ఎల్ఎల్‌బీ, హానర్స్ విద్యార్థులకు ద్వితీయ, నాల్గవ సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లుగా 23 నుంచి 30వర కు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు.

నేడు వైద్య శిబిరం

అనంతపురం టౌన్, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): గ్రహణం మొర్రి పిల్లల కోసం శుక్రవారం ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు రాష్ట్రీయబాల ఆరోగ్య ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణస్వామి, డీఈఐసీ మేనేజరు రజిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఎంహెచ్‌ఓ, ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో జిల్లా ఆస్పత్రి ఆవరణంలోని డీఈఐసీ సెంటర్‌లో శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. హైదరాబాద్ ఏపీఆర్ ఆస్పత్రి డాక్టర్ల సహకారంతో పెదవిచీలిక, గ్రహణం మొర్రితో బాధపడుతున్న పిల్లలకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. బాధిత చిన్నారులకు ఎన్టీఆర్ వైద్యఆరోగ్యశ్రీ కింద ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించడం జరుగుతుందన్నారు.

టోల్ పెంపును రద్దు చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): వాహనదారులపై పెరిగిన అదనపు టోల్ రుసుముల భారాన్ని వెంటనే రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ గురువారం ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో రెండు నేషనల్ టోల్‌గేట్‌ల మీదుగా ప్రయాణించే వాహనదారులపై వేల రూపాయల భారం పడుతోందన్నారు. కాంట్రాక్టర్లకు టోల్ పేరుతో కట్టబెడుతున్నా రోడ్ల నిర్వహణ నాసిరకంగా ఉందని, దీనికితోడు ఆర్‌అండ్‌బీ రోడ్లపై టోల్ ప్రవేశపెడతామని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించారని, ఇది ప్రజలపై పెనుభారమవుతుందని తెలిపారు. ఈ మొత్తం టోల్ విధానాన్ని సమీక్షించి, తక్షణమే భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మొత్తం 69 టోల్ ప్లాజాలు ఉంటే, వాటిలో 65 టోల్‌ప్లాజాలలో సింగిల్ ఎంట్రీ విధానం తీసుకువచ్చి, రోజులో ఎన్నిసార్లు తిరిగితే అన్నిసార్లు టోల్ రుసుములు పూర్తిస్థాయిలో వసూలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని, దీనివల్ల సొంత, బాడుగ వాహనదారులపై అధికభారం పడుతుందన్నారు. ఈ విధానం వల్ల అద్దెవాహనాలు నడుపుకునేవారిపై తీవ్ర ప్రభావం పడి జీవనోపాధిని కోల్పోయే ప్రమాదముందన్నారు. అనంతపురం-గుత్తి మధ్య గత సెప్టెంబరు వరకు ఒక కారు ఒకసారి వెళ్లి తిరిగి వచ్చినందుకు రూ.160లు చెల్లించేవారని, ఒకసారి టోల్ చెల్లించిన తర్వాత 24 గంటల్లో ఎన్నిసార్లు తిరిగినా రుసుము చెల్లించాల్సిన అవసరం ఉండేది కాదన్నారు. అయితే కొత్త నిబంధనల ప్రకారం రూ.160ల ఫీజును రూ.240లకు పెంచి, రోజులో ఎన్నిసార్లు తిరిగితే అన్నిసార్లు రూ.240లు చెల్లించేలా భారం మోపారన్నారు. ఇదే తరహాలో అన్నిరకాల వాహనదారులపై భారం పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో టోల్ చార్జీల పెంపును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ అనంతపురం రీజియన్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి జనవరి 19వ తేదీ వరకు ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. మాసోత్సవాల సందర్భంగా ఆర్టీసీ సిబ్బంది కార్గో సేవలు, డోర్ డెలివరీ విధానం గురించి ప్రజలందరికీ తెలియపరిచి, సేవలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. 2021 సెప్టెంబరు 1 నుంచి ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ సదుపాయం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. జిల్లాలో అనంతపురంతోపాటు గుత్తి, గుంతకల్లు, రాయదుర్గం, తాడిపత్రి పట్టణాల్లో డోర్ డెలివరీ విధానం అందుబాటులో ఉందని, 50 కేజీల బరువు వరకు పార్సిల్ బుకింగ్స్‌ను పార్సిల్ కౌంటర్‌కు 10కిలోమీటర్ల పరిధిలోపు గల వినియోగదారుల ఇళ్లవద్దకే చేర్చడం జరుగుతుందన్నారు. కార్గో సేవలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన తీసుకొచ్చి, మాసోత్సవాలను విజయవంతం చేయాలని సిబ్బందికి పిలుపునిచ్చారు.

తప్పుల సవరణకు 23 వరకు అవకాశం

అనంతపురం విద్య, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థుల వివరాల తప్పుల సవరణకు ఈనెల 23వ తేదీ వరకు విద్యాశాఖ అవకాశం కల్పించినట్టు డీఈఓ ప్రసాద్ బాబు, ఏసీ గోవింద్ నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే ఏడాది మార్చి 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు 10వ తరగతి పరీక్షలు ఉంటాయన్నారు. దీనికి సంబంధించిన విద్యార్థుల నామినల్ రోల్స్(ఎన్ఆర్) వివరాలు ఏవైనా తప్పుగా నమోదై ఉంటే...వాటిని ఈనెల 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకూ సవరించడానికి పరీక్షల విభాగం డైరెక్టర్ అనుమతి ఇచ్చారన్నారు. ప్రధానోపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నిర్లక్ష్యంతోనే ప్రమాదం..!

విధులను బహిష్కరించిన కార్మికులు
అదానీ ఫ్యాక్టరీలో గోప్యంగా విచారణ
శివకేశవ కుటుంబంలో తీవ్ర విషాదం
గాయపడ్డవారికి బెంగళూరులో చికిత్స

యాడికి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): అదానీ సిమెంట్ ఫ్యాక్టరీలో యాజమాన్యం నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగినట్లు సమాచారం. వేడి చల్లారిన తరువాత కూలర్‌కు మరమ్మతులు చేయాల్సి ఉండగా.. అప్పటికప్పుడు చేయాలని ఆ విభాగం అధికారి కార్మికులపై ఒత్తిడి తెచ్చారని, అందుకే ఘోరం జరిగిందని పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ ప్రమాదం గురించి అధికారులు గురువారం విచారించారు. గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం గురించి సిబ్బందిని ఆరాతీశారని సమాచారం. అధికారులు వచ్చిన సమయంలో విలేకరులను ఫ్యాక్టరీ ఆవరణలోకి అనుమతించలేదు. విచారణ రహస్యంగానే కొనసాగింది. ఫ్యాక్టరీ గెస్ట్‌హౌస్‌లో ప్రభుత్వ అధికారులు, ఫ్యాక్టరీ అధికారులు ఎక్కువసేపు చర్చలు జరిపినట్లు కార్మికులు చర్చించుకుంటున్నారు. ఫ్యాక్టరీ ఆవరణలోకి విలేకరులు సహా ఎవరినీ రానివ్వకుండా పోలీసు, ఫ్యాక్టరీ సెక్యూరిటీ సిబ్బంది భద్రతను కట్టుదిట్టం చేశారు. జరిగిన ప్రమాదం గురించి గోప్యత పాటించడం అనుమానాలకు తావిస్తోందని స్థానికులు, కార్మికులు వ్యాఖ్యానించారు. తాడిపత్రి డీఎస్పీ రామకృష్ణుడు, యాడికి సీఐ ఈరన్న ఆధ్వర్యంలో యాడికి, పెద్దవడుగూరు, పెద్దపప్పూరు, తాడిపత్రి స్టేషన్ల సిబ్బందితో గట్టి బందోబస్తు నిర్వహించారు.

కుటుంబ పెద్ద దిక్కు

పెద్దవడుగూరు మండలం కిష్టిపాడు గ్రామానికి చెందిన శివకేశవ ఈ ప్రమాదంలో మృతి చెందారు. ఆయనకు వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు లక్ష్మీదేవి, రంగనాయకులు, భార్య గీతాదేవి, మూడేళ్ల కుమారుడు మహాదేవ్‌యాదవ్ ఉన్నారు. శివకేశవ తల్లిదండ్రులు కూలీలు. భార్య గీతాదేవి డీఎడ్ పూర్తి చేశారు. అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ పాఠశాలలోనే టీచర్‌గా పనిచేస్తున్నారు. కుమారుడు మహాదేవ్ యాదవ్‌కు మూడేళ్లు పడటంతో ఇటీవల పుట్టువెంట్రుకలు తీయించారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న శివకేశవ ప్రమాదంలో మృతిచెందడంతో తల్లిదండ్రులు, భార్య గుండెలవిసేలా రోదించారు. ఇక తమకు దిక్కెవరని తాడిపత్రి ప్రభుత్వ ఆస్పత్రిలో వారు విలపించడం అక్కడున్నవారిని కలచివేసింది.

యాజమాన్యం నిర్లక్ష్యమే..

ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదం విషయంలో యాజమాన్యం తీరును నిరసిస్తూ కార్మికులు గురువారం విధులను బహిష్కరించారు. ఏ ఒక్కరూ లోపలికి వెళ్లకుండా, ఫ్యాక్టరీ ప్రధానగేటు సమీపంలో ఉండిపోయారు. ఫ్యాక్టరీలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, బాధిత కార్మికుల కుటుంబాలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ఫ్యాక్టరీ యాజమాన్యంపై ఉందని వారు అన్నారు. చెడిపోయిన కూలర్‌లో వేడి తగ్గేదాకా ఆగి, 24 గంటల తర్వాత కార్మికులను మరమ్మతు పనులకు లోపలకి పంపించాల్సి ఉందని అన్నారు. త్వరగా మరమ్మతు చేయించాలని ఫ్యాక్టరీ అధికారి ఒత్తిడి చేయడంతోనే కార్మికులు కూలర్ డోర్ తెరిచారని, దీంతో ఒక్కసారిగా లోపల బ్లాస్ట్ జరిగిందని అన్నారు. బ్లాస్ట్ జరిగిన సమయంలో కూలర్‌కు ఉన్న ఇటుకలు, బొగ్గుపొడి కార్మికులపై పడటంతో ఒకరు మృతిచెందారని, ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు.



హాస్పిటల్ వద్ద రోదిస్తున్న శివకేశవ కుటుంబ సభ్యులు

అమ్మ ఒడిలో చిన్నారి..

శివకేశవ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించే సమయంలో ఆయన మూడేళ్ల కుమారుడు మహాదేవ్‌యాదవ్ తల్లి ఒడిలో నిద్రిస్తూ కనిపించాడు. బాలున్ని చూసిన వారందరూ 'పాపం పిల్లవాడు.. వాళ్ల నాన్న చనిపోయాడని ఎలా తెలుస్తుంది.' అని ఆవేదన వ్యక్తం చేశారు.

రూ.30 లక్షల పరిహారం.. ఉద్యోగం

ప్రమాదంలో మృతిచెందిన శివకేశవ కుటుంబానికి రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నారు. శివకేశవ భార్యకు ఉద్యోగం, నెలకు రూ.10వేల దాకా పెన్షన్ అందిస్తారని తెలిసింది. ప్రభుత్వ అధికారులతో మాట్లాడి కిష్టిపాడు గ్రామంలో రెండు ఎకరాల భూమిని కేటాయించేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిసింది.

బెంగళూరులో చికిత్స

ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నలుగురు కార్మికులు షణ్ముకానందరెడ్డి, దీపకొసేన్, కంబగిరిరాముడు, బికాస్‌సాహు బెంగళూరులోని సెయింట్ జాన్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. వీరిలో షణ్ముకానందరెడ్డి, దీపక్‌సేన్‌కు శస్త్రచికిత్స నిర్వహించాల్సి ఉంటుందని తెలిసింది. కంబగిరి రాముడు, బికాస్‌సాహు ఆరోగ్య పరిస్థితి బాగున్నట్లు తెలిసింది.

కేసు నమోదు

అదానీ సిమెంట్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంపై బాధితుడు, యాడికి మండలం చింతలాయపల్లి గ్రామానికి చెందిన కంబగిరిస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని యాడికి యూపీఎస్ సీఐ ఈరన్న గురువారం తెలిపారు. బోయరెడ్డిపల్లి వద్ద ఉన్న అదానీ సిమెంట్ ఫ్యాక్టరీలో కూలర్ చెడిపోయిందని, తక్షణమే మరమ్మతు చేయాలని సంబంధిత డిపార్ట్‌మెంట్ అధికారి ఆదేశించడంతో ఆరుగురు కార్మికులం మరమ్మతులు చేయడానికి బుధవారం రాత్రి వెళ్లామని బాధితుడు తెలిపారని సీఐ వివరించారు. కూలర్ వద్ద ఉన్న డోర్ తెరవడంతో ఒక్కసారిగా వేడి వేడి ఇటుకలు, బొగ్గుపొడి వచ్చిమీద పడిందని, దీంతో కార్మికులు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. ఫ్యాక్టరీ సిబ్బంది వెంటనే వారిని చికిత్స నిమిత్తం తాడిపత్రికి తరలించారని తెలిపారు.



ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ, తహసీల్దార్

టమోటా కిలో రూ.14

అనంతపురం రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో గరిష్ఠంగా రూ.14తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు గురువారం 1125 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 10, కనిష్ఠ ధర ఏడు రూపాయలు పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ.. టన్ను రూ. 24 వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 24,290 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 5 వేలు, సరాసరి రూ. 16 వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 10టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

636 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు గురువారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 636 క్యూసెక్కులు వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు గురువారం తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 317 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

బాలుడిని మింగిన నిర్లక్ష్యం..!

మురుగు గుంతలో తేలిన శవం..
కన్నీటి సంద్రంలో కుటుంబ సభ్యులు



బాలుడి మృతదేహం వద్ద రోధిస్తున్న కుటుంబ సభ్యులు



మహ్మద్ అల్మాన్ (ఫైల్)



మృతికి కారణమైన మురుగునీటి గుంత

పెనుకొండ టౌన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బాలుడి అదృశ్యం విషాదాంతమైంది. నాలుగేళ్ల పసివాడిని నిర్లక్ష్యం పొట్టనబెట్టుకుంది. ఆడుకుంటూ వెళ్లి మురుగు గుంతలో పడి మరణించినట్లు తేలింది. మృతదేహాన్ని గురువారం పోలీసులు వెలికితీశారు. దీంతో బాలుడి కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. బాబయ్యస్వామి ఉరుసు ఉత్సవాలకు వేలాదిగా జనం వస్తారని తెలిసినా.. కాంట్రాక్టర్ పెద్ద గుంత తవ్వి, అందులోకి మురుగు నీరు వదిలారు. అక్కడ ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. దానిపై కప్పు కూడా వేయలేదు. ఆ నిర్లక్ష్యమే బాలుడిని బలిగొంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెనుకొండలో బాబయ్యస్వామి ఉరుసు జరుగుతోంది. కర్ణాటకలోని చిత్రదుర్గ పట్టణానికి చెందిన జాఫర్.. భార్య సల్మా, కుమారులు ఫర్హాన్, మహ్మద్ అల్మాస్ (4), బంధువులు పర్వీన్, గుల్జార్ బానుతో కలిసి ఈనెల 17న ఉరుసుకు వచ్చారు. అదేరోజు సాయంత్రం మహ్మద్ అల్మాస్ ఆడుకుంటూ కనిపించకుండా పోయాడు. దీంతో తల్లిదండ్రులు.. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్రమత్తమైన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. మిస్సింగ్ కేసు నమోదు చేశారు. దర్గా వెనుకభాగంలో మురుగునీరు వెళ్లేందుకు పెద్ద గుంత తవ్వారు. పోలీసులకు అనుమానం వచ్చి అందులోని నీటిని బుధవారం కొంతవరకు తోడించారు. గురువారం ఉదయం బాలుడి శవం తేలింది. పోలీసులు బయటకు తీశారు. అది అదృశ్యమైన బాలుడిదేనని కుటుంబీకులు గుర్తించారు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. కాంట్రాక్టర్ మహబూబ్ బాషా.. మురుగునీటి కోసం పెద్దగుంత తీశాడు. మహ్మద్ అల్మాస్ ఆడుకుంటూ వెళ్లి అందులో పడి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.

బాధ్యులపై చర్యలు: వెంకటేశ్వర్లు, డీఎస్పీ

దర్గా పరిధిలో మురుగునీటి నిర్వహణకు తగు జాగ్రత్తలు తీసుకోకపోవడంతోనే ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. మృతికిగల కారణాలపై దర్యాప్తు చేస్తున్నాం. బాలుడి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకుంటాం.

చేనేత కార్మికుడి ఆత్మహత్య

ధర్మవరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): అనారోగ్యం, పెళ్లి కాలేదని మనస్తాపం చెంది పట్టణంలోని లక్ష్మీనగర్‌కు చెందిన చేనేత కార్మికుడు కిరణ్ (36) గురువారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణ పరిధి పోతుకుంట బ్రిడ్జి సమీపాన రైలు కింద పడి మరణించాడు. ధర్మవరం రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లక్ష్మీనగర్‌కు చెందిన పుల్లయ్య కుమారుడు కిరణ్ కూలిమగ్గం నేస్తుండేవాడు. కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతుండేవాడు. తల్లిదండ్రులు వృద్ధులు కావడంతో వారి బాధ్యత కిరణ్‌పై పడింది. ఇద్దరు చెల్లెళ్లు కూడా ఉన్నారు. అప్పులు చేసి, పెద్ద చెల్లెలికి వివాహం చేశాడు. రెండో చెల్లెలు ఎంసీఏ పూర్తి చేసి, ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తోంది. కిరణ్ వివాహం చేసుకుందామంటే ఎవరూ అమ్మాయిని ఇవ్వలేదు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన అతడు ఆత్మహత్య చేసుకున్నాడు. కీమన్ సమాచారంతో ధర్మవరం రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

క్రైం కార్నర్ CRIME CORNER

తాగొద్దన్నందుకు ఇద్దరి ఆత్మహత్య

అనంతపురం క్రైం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మద్యం తాగుతున్నారని మందలించినందుకు వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. అనంతపురం రూరల్ మండలం ఎ.నారాయణపురం గ్రామానికి చెందిన పూలశెట్టి సురేష్(38) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య, కూతురు ఉన్నారు. ఆరేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలికి, చేతికి రాడ్ వేశారు. ఆ ప్రమాదం జరిగినప్పటి నుంచి ప్రతి రోజు మద్యం తాగుతున్నాడు. దీంతో తల్లిదండ్రులు మందలించేవారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన భార్య పుట్టింటికి వెళ్లింది. ఈక్రమంలో గురువారం తెల్లవారుజామును తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. అనంతపురం సంఘమిత్ర కాలనీకి చెందిన షేక్ షెక్షావలి(26) గురువారం ఉరి వేసుకున్నాడు. షెక్షావలి బొరుగుల వ్యాపారి. ఇతనికి భార్య, కుమారుడు ఉన్నారు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ సభ్యులు చెప్పినా మారలేదు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గురువారం సాయంత్రం 7గంటల సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. నాలుగో పట్టణ పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల ఒత్తిడితో..

అనంతపురం నగరంలోని శారదానగర్‌కు చెందిన సోమశేఖర్ (42) గురువారం రాత్రి 7.30గంటల సమయంలో జేఎన్టీయూ సమీపంలోని పొదల్లో చెట్టుకు ఉరివేసుకున్నాడు. అప్పుల ఒత్తిడితో ఆత్మహత్య చేసుకున్నట్లు వన్‌టౌన్ పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని అన్నారు.

యువతి అదృశ్యం...

అనంతపురం రూరల్ మండలం కురుగుంటకు చెందిన షేక్ నసీమా అదృశ్యమయ్యారు. ఈమె ఓ షో రూమ్‌లో పనిచేసేవారు. కొంతకాలంగా ఇంటి వద్దే ఉంటున్నారు. గురువారం ఉదయం ఉదయం 10.30 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయారు. రాత్రయినా తిరిగి రాకపోవడంతో తల్లి వహీదా అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మద్యం మత్తులో ఘర్షణ

గార్లదిన్నె, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం రాత్రి మద్యం మత్తులో కొందరు యువకులు పరస్పరం దాడులు చేసుకున్నారు. గార్లదిన్నెకు చెందిన నాగార్జున, జగదీష్, రామ్మోహన్‌రెడ్డి, నాగులగుడ్డం గ్రామానికి చెందిన ప్రవీన్‌కుమార్ డాబా సమీపంలో మద్యం సేవించారు. మాటా మాటా పెరిగి గొడవ పడ్డారు. ఘర్షణ తారస్థాయి చేరి ఒకరినొకరు కొట్టుకున్నారు. నలుగురూ గాయపడ్డారు. వీరిలో తీవ్రంగా గాయపడిన రామ్మోహన్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారించారు. నాగార్జున, జగదీష్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా తెలిపారు.

సొంతింటి కోసం చోరీలు

ముఠా ఏర్పాటు చేసిన ఎలక్ట్రీషియన్
నలుగురి అరెస్టు.. ఇద్దరు పరారీ
ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ కేసుల్లో రికవరీ



అరెస్టయిన నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు ఓ ఎలక్ట్రీషియన్ దొంగ అయ్యాడు. మరికొందరితో ముఠాగా ఏర్పడి.. తనకు తెలిసిన విద్యను చోరీలకు వాడుకున్నాడు. పోలీసులకు పట్టుబడి కటకటాలపాలయ్యాడు. తోటలలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి రాగి, అల్యూమినియం వైర్లను చోరీ చేస్తున్న నలుగురు సభ్యుల ముఠాను అనంతపురం సీసీఎస్, రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ఇద్దరు పరారీ అయ్యారు. వారి నుంచి 450 కిలోల రాగి వైరు, 180 కిలోల అల్యూమినియం వైరును స్వాధీనం చేసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో ఏడాదికాలంలో జరిగిన 33 దొంగతనాల్లో రికవరీ చూపించారు. పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ జగదీష్ గురువారం వివరాలను వెల్లడించారు.

సొంతింటి కలతో మొదలు

కంబదూరు మండలం నూతిమడుగు గ్రామానికి చెందిన రాఘవేంద్ర ముఠాలో కీలక వ్యక్తి. ఇతను ఎలక్ట్రీషియన్. విద్యుత్ శాఖ స్థానిక అధికారులు, హెల్పర్లకు సాయంగా పనులకు వెళ్లేవాడు. సొంత ఇల్లు కట్టుకోవాలని చిరకాల కోరిక ఉంది. కూలి డబ్బులు కుటుంబ పోషణకే సరిపోయేవి. ఇంటి నిర్మాణం కోసం చోరీలు చేయాలని నిర్ణయించుకున్నాడు. వ్యవసాయ కనెక్షన్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులో అనుభవం ఉండటంతో ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి, అల్యూమినియం వైర్లను చోరీ చేయాలని భావించాడు. అదే మండలానికి చెందిన విద్యుత్ బిల్లులు తీసే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు చిరంజీవి, పరంధామను జత చేసుకున్నాడు. ఆ తరువాత కంబదూరు మండలం తిప్పేపల్లికి చెందిన వాసు, వెంకటాంపల్లికి చెందిన వన్నూరు స్వామి అలియాస్ జానీ కూడా తోడయ్యారు.

అనువైన ప్రాంతాలను గుర్తించి..

వన్నూరుస్వామి, ఎర్రిస్వామి దొంగతనం చేయడానికి అనువైన ప్రదేశాలను, రాగి వైర్ కలిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి.. రాఘవేంద్రకు సమాచారం చేరవేసేవారు. ఆ తరువాత చోరీలు చేసేవారు. ఏడాది నుంచి ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలలో చోరీలు చేశారు. రాగి, అల్యూమినియం వైర్లను సంచుల్లో తరలించేవారు. అమ్మేందుకు సులువుగా ఉండేలా వైర్లను ముద్దలుగా చేయించి, కక్కలపల్లి సమీపంలోని ఓ గుడిసెలో దాచారు. హైదరాబాద్‌లో విక్రయించేందుకు సిద్ధమైన సమయంలో పోలీసులకు సమాచారం అందింది. దీంతో రాఘవేంద్ర, చిరంజీవి, పరంధామ, ఎర్రిస్వామిని పోలీసులు అరెస్టు చేశారు. వాసు, వన్నూరు స్వామి పరారీలో ఉన్నారు. వాసుపై కంబదూరు పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీట్ ఉంది. ఈ ముఠాపై 33 దొంగతనం కేసులు ఉన్నాయి. కళ్యాణదుర్గం రూరల్ పీఎస్ పరిధిలో 6, పుట్లూరులో 6, అనంతపురం రూరల్-3, కంబదూరు-3, రాప్తాడు-3, చిలమత్తూరు-2, ఇటుకలపల్లి -2, యాడికి-2, బుక్కరాయసముద్రం-2, గార్లదిన్నె-1, కుందుర్పి-1 కేసు నమోదయ్యాయి. రాఘవేంద్రపై 8 కేసులు, వాసుపై 3 కేసులు, ఎర్రిస్వామిపై 2 కేసులు ఉన్నాయి. పాత కేసుల్లో వీరు ముద్దాయిలు.



వైర్లను పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

నిఘా వేసి..

వ్యవసాయ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలపై నిఘా వేయాలని ఎస్పీ జగదీష్ ఆదేశించారు. దీంతో ఏఎస్పీ రమణమూర్తి పర్యవేక్షణలో అనంతపురం సీసీఎస్ సీఐలు ఇస్మాయిల్, జైపాల్‌రెడ్డి, అనంతపురం రూరల్ సీఐ శేఖర్, ఎస్ఐ రాంబాబు ప్రత్యేక నిఘా వేశారు. సీసీఎస్ హెడ్‌కానిస్టేబుళ్లు మల్లికార్జున, చంద్రశేఖర్, శ్రీధర్‌ఫణి, శ్రీనివాసులు, నరసింహులు, వెంగప్ప, కానిస్టేబుళ్లు రంజిత్‌కుమార్, బాలకృష్ణ, షామీర్, అనంతపురం రూరల్ హెడ్‌కానిస్టేబుళ్లు గిరిబాబు, ప్రసాద్, కానిస్టేబుళ్లు రాజు, శివయ్య, ప్రసాద్, పాండవ, అనిల్‌కుమార్ ప్రత్యేక బృందంగా ఏర్పడి ముఠాపై నిఘా వేశారు. కక్కలపల్లి సమీపంలోని ఓ గుడిసెలో దాచిన రాగి, అల్యూమినియం వైర్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ బృందాన్ని ఎస్పీ అభినందించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు బాధ్యతగా పనిచేయాలి

ఆర్టీఓలు, రవాణా ఇన్‌స్పెక్టర్లకు జేటీసీ ఆదేశం



మాట్లాడుతున్న జేటీసీ కృష్ణవేణి

హిందూపురం అర్బన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణకు ప్రతి రవాణా అధికారీ బాధ్యతగా పనిచేయాలని రాయలసీమ జిల్లాల జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ (జేటీసీ) కృష్ణవేణి పేర్కొన్నారు. స్థానిక రవాణాశాఖ కార్యాలయంలో గురువారం రవాణాశాఖ ప్రాంతీయ అధికారులు, ఇన్‌స్పెక్టర్లతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ.. పిల్లలకు తల్లిదండ్రులు వాహనాలు కొనివ్వడం తప్పుకాదు కానీ, వారిని కనిపెట్టుకుని ఉండాలనానరు. వాహనం ఎలా నడుపుతున్నారో తెలుసుకుని, తగిన సలహాలు ఇవ్వాలన్నారు. చలానాల రూపంలో లక్ష్యాన్ని అధిగమించాలన్నారు. కార్యక్రమంలో హిందూపురం ఆర్టీఓలు కరుణసాగర్ రెడ్డి, శ్రీనివాసులు, ఇన్‌స్పెక్టర్లు వరప్రసాద్, రాణి, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

పోక్సో కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్ష

చిలమత్తూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): బాలికను వేధించిన కేసులో స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన యువకుడు మధుపై అనంతపురం పోక్సో స్పెషల్ కోర్టు న్యాయాధికారి రాజ్యలక్ష్మి మూడేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించారు. చిలమత్తూరు పోలీసు స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ గురుస్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మధు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను లైంగికంగా వేధిస్తుండేవాడు. బాలిక.. విషయాన్ని తల్లికి చెప్పింది. బాలిక తల్లిని కూడా మధు బెదిరించడంతో స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మూడేళ్ల క్రితం దీనిపై పోక్సో కేసు నమోదు చేసి, నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. విచారణలో మధు నేరం చేసినట్లు రుజువవడంతో న్యాయాధికారి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.



నేను సీఐడీ ఆఫీసర్‌ను..!

అగ్రిగోల్డ్ భూముల్లోకి వెళ్లేవారికి సర్వేయర్ బెదిరింపులు?

పుట్లూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): 'ఎవరండీ అగ్రిగోల్డ్ భూముల విషయంలో మాట్లాడేది..? నేను కర్నూలు నుంచి సీఐడీ ఆఫీసర్‌ను మాట్లాడుతున్నా..' అంటూ ఓ సర్వేయర్ హల్‌చల్ చేస్తున్నాడు. 'మీకు ఏమి సమాచారం కావాలన్నా నన్ను అడగండి..' అంటూ కొందరిని బెదిరిస్తున్నటుల సమాచారం. మండలంలోని కడవకల్లు- చెర్లోపల్లి గ్రామాల మధ్య ఉన్న అగ్రిగోల్డ్ భూముల వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. ఆ భూముల జోలికి వస్తే ఎంతకైనా తెగిస్తామని అక్కడకు వెళ్లిన వామపక్ష నాయకులను, చూసేందుకు వెళ్లిన అధికారులను వైసీపీ నాయకుడు బెదిరిస్తున్నట్లు సమాచారం. ఎన్నో ఏళ్లుగా సాగుచేసుకుంటున్నామని, ఇప్పుడు వెళ్లమంటే ఎలా అంటూ మండిపడుతున్నాడు. దీంతో అధికారులు ఏమీ చేయలేకున్నారు. ఈ క్రమంలో ఓ సర్వేయర్ ఆ భూములు మొత్తం తన పరిధిలోనే ఉన్నాయంటూ హంగామా చేస్తున్నాడు.

కన్నెత్తి చూడని అధికారులు

అగ్రిగోల్డ్ భూములను వైసీపీ నాయకుడు సాగు చేస్తున్న విషయం తెలిసినా జిల్లా అధికారులు, సీఐడీ అధికారులు కన్నెత్తి చూడటంలేదు. ఆంధ్రజ్యోతి కథనాలతో కొందరు అధికారులు అక్కడికి వెళ్లే ప్రయత్నం చేసినా.. బెదిరింపులతో మిన్నకుండిపోతున్నారని సమాచారం. ఆ ప్రాంతానికి వెళ్లిన వామపక్ష, ప్రజా సంఘాల నాయకులకు ఓ సర్వేయర్ సీఐడీ ఆఫీసర్ అంటూ బెదిరింపులకు దిగుతున్నట్లు తెలిసింది. వైసీపీ నాయకుడే దగ్గరుంచి ఫోన్ చేయిస్తున్నాడని ప్రచారం జరుగుతోంది. వంద ఎకరాలకుపైగా అగ్రిగోల్డ్ భూములు సాగు చేస్తున్న వైసీపీ నాయకుడు కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా తగ్గడం లేదు. ఉన్నతాధికారులతో సయోధ్య కోసం టీడీపీ నాయకులద్వారా రాయబేరాలు నడుపుతున్నట్లు తెలిసింది. భూముల విషయంలో సీఐడీ అధికారి పేరిట సర్వేయర్ ఫోన్ చేసిన విషయం తన దృష్టికి రాలేదని మండల సర్వేయర్ శాంతి అన్నారు. విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



అగ్రిగోల్డ్ భూముల ముఖద్వారం

మెప్మాలో అక్రమాలపై ఫిర్యాదు

ధర్మవరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో అక్రమాల డొంక కదులుతోంది. బోగస్ మహిళా సంఘాలను సృష్టించి, రుణాలు కాజేయడంపై ఓ బ్యాంకు అధికారి.. గురువారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మెప్మాలో పనిచేసే టీఎంసీ వెంకటేశ్‌తో, ఆర్పీ శోభారాణిపై ఫిర్యాదు అందజేశారు. గత వైసీపీ హయాంలో మెప్మాలోని కొందరు ఏకమై రూ.3కోట్లకుపైగా బోగస్ సంఘాల మాటున రుణాలు తీసుకుని, తిరిగి చెల్లించకుండా బ్యాంకర్లకు ముప్పుతిప్పలు పెడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదే తరహాలో ఇటీవల టీఎంసీ, ఆర్పీ కలిసి యాక్టివ్‌గాలేని గ్రూపులను బయటకు తీశారు. ఇతర సంఘాల్లోని కొందరిని చేర్చి, సీఓల ప్రమేయం కూడా లేకుండా బ్యాంకర్ల కళ్లుగప్పి భారీ ఎత్తున రుణాలు తీసుకున్నట్లు తెలిసింది. ఓవర్‌సీస్ బ్యాంకుల్లో ఐదు బోగస్ సంఘాలను సృష్టించి, రూ.కోటిదాకా రుణాలు తీసుకున్నట్లు ఆ బ్యాంకు అధికారులు.. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు అధికారులు కంగుతిన్నారు. ఎవరి ప్రమేయంతో రుణాలు తీసుకున్నారో అందుకు బాధ్యులైన మెప్మా అధికారి వెంకటేశ్, ఆర్పీతోపాటు సిబ్బందిని పిలిపించి నిలదీయడంతో బోగస్ సంఘాల పేరుతో తీసుకున్న రుణాలను చెల్లిస్తామనీ, అందుకు గడువు కోరినట్లు తెలుస్తోంది. వారిచ్చిన గడువు కూడా దాటిపోవడంతో చేసేదిలేక ఓవర్‌సీస్ బ్యాంకు అధికారులు గురువారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీంతో మెప్మా అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

డివైడర్‌పై వ్యాపారం..!

- కొత్తచెరువులో పద్మవ్యూహాన్ని తలపిస్తున్న ట్రాఫిక్
- ఫుట్‌పాత్‌ల ఆక్రమణ
- రోడ్లపైనే నిలుపుతున్న వాహనాలు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు

కొత్తచెరువు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో నిత్యం ట్రాఫిక్ అధికంగా ఉంటుంది. పుట్టపర్తి జిల్లా కేంద్రం కావడం ఈ ట్రాఫిక్ మరింత అధికమైంది. పుట్టపర్తికి.. కియా పరిశ్రమలకు వెళ్లే వేలాది బస్సులు, కార్లు ఇతర వాహనాలతో ఈ కూడలి రద్దీగా ఉంటుంది. ఈ కూడలిలో ట్రాఫిక్‌ను నియంత్రించేవారు లేకపోవడంతో ఓ పద్మవ్యూహాన్ని తలపిస్తోంది. ఆ కూడలిని దాటుకొని వెళ్లడానికి వాహనదారులు, ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

● డివైడర్ల పైనే వ్యాపారాలు

ఇంత బిజీగా ఉన్న కొత్తచెరువు రోడ్ల మధ్యలో ఉన్న డివైడర్లపై తోపుడు బండ్లు ఉంచి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా రోడ్లపై ఎక్కడబడితే అక్కడ ఆటోల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఇక ఫుట్‌పాత్‌లపై చిరుతిండ్ల దుకాణాలు అధికంగా వెలిశాయి. నాలుగు రోడ్లకు ఇరువైపులా వ్యాపార దుకాణాలు ఉన్నాయి. ఆ దుకాణాదారులు, ఆ దుకాణాలకు వచ్చే వారు తమతమ వాహనాలను అడ్డదిడ్డంగా.. ఎక్కడపడితే అక్కడ రోడ్లపై పార్కింగ్ చేస్తున్నారు. దీని వల్ల ఆ మార్గాల ద్వారా పాఠశాలలకు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే విద్యార్థులు, అధికారులు, ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు, గ్రామపంచాయతీ అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

● పట్టించుకోని అధికారులు

మండలకేంద్రంలోని ఆర్అండ్‌బీ, పంచాయతీ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రధాన కూడలిలోని దుకాణాదారులు రోడ్లను ఆక్రమించి.. రేకుల షెడ్లు నిర్మించుకున్నారు. దీంతో రోడ్డు విస్తీర్ణం బాగా తగ్గిపోయింది. పార్కింగ్.. ఫుట్‌పాత్ లేకుండా పోయింది. దీనికి తోడు దుకాణాలకు వచ్చేవారు వారివారి వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ స్తంభించిపోతోంది.



డివైడర్‌పై నిర్వహిస్తున్న వ్యాపారాలు ▲



నెహ్రూ కూడలిలో ట్రాఫిక్ ▼

రూల్స్ అతిక్రమిస్తే చర్యలు

రోడ్లపై అడ్డదిడ్డంగా వాహనాలు పార్కింగ్ చేసినా.. డివైడర్లు.. ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు నిర్వహించినా.. కఠిన చర్యలు తీసుకుంటాం. వ్యాపారులు తమ దుకాణాల ముందు రేకుల షెడ్లను నిర్మించుకోరాదు. దుకాణాల ఎదుట వాహనాలను పార్కింగ్ చేయరాదు. ఎవరైనా వాహనాల రాకపోకలకు అంతరాయం కల్గిస్తే వారిపై కేసులు నమోదు చేస్తాం. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులను సైతం ఏర్పాటు చేశాం.

- ఇందిర, సీఐ, కొత్తచెరువు

న్యూస్ బాక్స్ ...

22న గణిత ప్రతిభ పరీక్ష

కదిరి అర్బన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): శ్రీనివాస రామానుజం జయంతి సందర్భంగా తిరుపతి నిత్యం సైనిక, నవోద పోటీ పరీక్షల కేంద్ర ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఎస్ఎంజెఎల్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు గణిత ప్రతిభ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎంఎస్ బాబు తెలిపారు. ఈ పరీక్షలకు 5 నుంచి 8వతరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ఈపరీక్షల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు తరగతుల వారీగా ప్రథమ బహుమతి రూ.20వేలు, ద్వితీయ బహుమతి రూ.10వేలు, తృతీయ బహుమతి రూ.5వేలు అంద చేస్తారన్నారు. ఆసక్తికలిగిన విద్యార్థులు 96888 88802, 79897 06483కు వాట్సాప్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

రైతుల గురించి జగన్ మాట్లాడటం విడ్డూరం

మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్న సమయంలో రైతు సంక్షేమం మరిచిపోయిన జగన్‌రెడ్డి.. నేడు రైతుసంక్షేమం గురించి మాట్లాడటం చాలా విడ్డూరంగా ఉందని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి గురువారం ఓ ప్రకటనలో విమర్శించారు. జగన్‌రెడ్డి ప్యాలెస్‌లో కూర్చొని విద్యార్థుల ఫీజు రీఎంబర్స్‌మెంట్, రైతు పెట్టుబడి సాయంపై మాట్లాడటం మానుకోవాలన్నారు. జగన్ తన ప్రభుత్వ హయాంలో మూరెడు డ్రిప్పు పైపు ఇవ్వలేని దద్దమ్మ ముఖ్య మంత్రిగా చరిత్రలో మిగిలిపోయాడన్నారు. ఐదేళ్ల కాలంలో రైతుల సంక్షేమం కాని, వారి కష్టాల గురించి ఏనాడూ పట్టించు కోలేదన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 13.52లక్షల ఎకరాల విస్తీర్ణం సాగు తగ్గిందన్నారు. ఐదేళ్లల్లో సొంత కార్యకర్తలనే గాలికొదిలేసిన జగన్‌రెడ్డి... ఇప్పుడు బయటకు వస్తే తన సొంత కార్యకర్తలే భరతం పడతారని భయపడి ప్యాలెస్ వదిలి బయటకు రావడం లేదన్నారు. ఇప్పటికైనా అనవసర విమర్శలు మానుకొని.. బుద్ధిగా మసలుకోవాలని హితవు పలికారు.

ఖాద్రీశుడి సేవలో కర్ణాటక మాజీ స్పీకర్

బెంగళూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కదిరి నరసింహ స్వామిని కర్ణాటక మాజీ స్పీకర్, మాజీ మంత్రి కేఆర్ రమేశ్‌కుమార్ గురువారం దర్శించుకున్నారు. ఆయన్ను ఆలయ అధికారులు సాదరంగా స్వాగతించారు. స్వామివారి దర్శనానంతరం తీర్థప్రాదాలు, శేషవస్త్రం అందజేశారు. ఆయన వెంట కోలారు జిల్లా కాంగ్రెస్ నాయకులు సంజయ్‌రెడ్డి, మోహన్‌గాంధీ, రాయల్ భాస్కర్ ఉన్నారు. ఆలయ అధికారులు శ్రీహరిప్రసాద్ తదితరులు స్వాగతం పలికారు.



ఆలయంలో మాజీ స్పీకర్ రమేశ్‌కుమార్

మదింపు వేగవంతం చేయండి

పుట్టపర్తి టౌన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూములు, స్థలాల మార్కెట్ విలువ మదింపు ప్రక్రియను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో భూముల మార్కెట్ విలువ సవరణ కమిటీ జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. భూములు, స్థలాల మార్కెట్ విలువను పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందని, అందుకు అనుగుణంగా ఈనెల 27తేదీలోపు భూములు, స్థలాల మార్కెట్ విలువను నిర్ధారించాలని తెలిపారు. సవరణ చేసిన మార్కెట్ విలువ, భూముల విలువను ప్రజలకు తెలిస్తే స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఆన్‌లైన్‌లో పొందుపరచడంతోపాటు సబ్‌రిజిష్టర్ కార్యాలయంలో నోటీసు బోర్డులో ప్రదర్శిస్తారన్నారు. వీటిపై ప్రజలు అభ్యంతరాలుంటే ఈనెల 24లోపు ఫిర్యాదు చేయవచ్చన్నారు. పెంచిన భూముల రిజిస్ట్రేషన్లు జనవరి 1నుంచి అమల్లోకి వస్తాయన్నారు. ఈకార్యక్రమంలో రిజిస్ట్రేషన్ శాఖ డిఐజీ విజయలక్ష్మీ, జిల్లా రిజిస్ట్రార్ కృష్ణకుమారి, వార్డు సచివాలయ నోడల్ అధికారి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆన్‌లైన్ లావాదేవీలపై అప్రమత్తత అవసరం

బుక్కపట్నం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రజలు, విద్యార్థులు నిత్యం ఆన్‌లైన్‌లో వస్తువులు కొనుగోలు, ఆన్‌లైన్ లావాదేవీలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్ సూచించారు. గురువారం జాతీయ వినియోగ దారుల రక్షణ దినోత్సవం సందర్భంగా బుక్కపట్నం డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఆన్‌లైన్ కొనుగోళ్లపై అవగాహన, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మగ్బుల్‌హుస్సేన్, వినియోగదారుల సంఘం సెకటరీ రామలక్ష్మి పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీషర్టుల అందజేత

ధర్మవరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో 75 మంది క్రీడాకారులకు రూ.27 వేలు విలువ చేసే టీషర్టులను గనిపినేని సాయికృష్ణ గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ అసోషియేషన్ పట్టణ అధ్యక్షుడు రాఘవ, సెక్రటరీ చందు, కోశాధికారి జనార్దన్, జాయింట్ సెక్రటరీ జింకా పురుషోత్తం, ఉపాధ్యక్షులు సందారవి, కోచ్ చైతన్య పాల్గొన్నారు.

22న వైద్యశిబిరం

ధర్మవరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేట బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రోటరీక్లబ్ అధ్యక్షుడు జయసింహ, కార్యదర్శి నాగభూషణ గురువారం ప్రకటనలో తెలిపారు. వైద్యశిబిరాన్ని ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహిస్తామని అన్నారు.

23న కౌన్సిల్ సమావేశం

ధర్మవరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి కౌన్సిలర్లు, కో-ఆప్షన్‌మెంబర్లు, అధికారులు తప్పకహాజరు కావాలన్నారు.

5న చలో విజయవాడ

ధర్మవరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): విజయవాడ జనవరి 5న హైందవ శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సత్యసాయి జిల్లావిశ్వహిందూపరిషత్ ప్రదాన కార్యదర్శి పులిచెర్ల వేణుగోపాల్ పేర్కొన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఈ నేపథ్యంలో నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమంలో ధర్మవరం నుంచి అధిక సంఖ్య పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. హిందూ దేవాలయాల పరిరక్షణ కోసం ఈ ఉద్యమం చేపడుతామన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

నల్లమాడ డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లమాడ అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు రాష్ట్రీయ బాల స్వస్థత కార్యక్రమంలో భాగంగా గురువారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. రెడ్డిపల్లి వైద్యురాలు దీప్తిరెడ్డి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆమె వెంట సీహెచ్ఓ రామాంజనేయులు, వైద్యసిబ్బంది ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

విధుల్లో అలసత్వం వీడండి : కలెక్టర్

పుట్టపర్తి టౌన్, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని శిశుసంక్షేమ శాఖ (ఐసీడీఎస్) ఉద్యోగులు, సిబ్బంది విధుల్లో అలసత్వం వీడాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ టీఎస్ చేతన్ హెచ్చరించారు. గురువారం కలెక్టర్ ఐసీడీఎస్ అధికారులతో నిర్వహించిన సమావే శంలో ఆయన మాట్లాడారు. మహిళ శిశుసం క్షేమ శాఖ అన్ని అంశాల్లో పూర్తిగా వెనుకబడి ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సకాలంలో పాలు, గుడ్లు పంపిణీ జరగాలన్నారు. ఇందులో ఎటువంటి అలసత్వం ప్రదర్శించినా సంబంధితాధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం పనులు త్వరగా పూర్తి చేయాలని ఆర్డ బ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ శాఖాధికారులను ఆదేశించారు. సీడీపీఓలు, సూపర్‌వైజర్లు ప్రతిరోజు వారి పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రా లను తనిఖీ చేస్తూ, సక్రమంగా పని చేయని ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. బాల్యవివాహాల నివారణ కోసం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రజలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్ర మంలో ఐసీడీఎస్ పీడీ వరలక్ష్మీ, సచివాలయ నోడల్ అధికారి సుధాకర్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, డీసీపీఓ మహేష్ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

31లోపు పంటల బీమా ప్రీమియం చెల్లించండి

ధర్మవరంరూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రబీలో సాగు చేసిన పంటలకు రైతులు ఈ నెల 31లోగా ప్రీమియం చెల్లించి.. బీమా చేయించుకోవాలని ఏఈ ముస్తఫా తెలిపారు. పంటలకు బీమా చేసుకొనే విధానంపై గురువారం మండలంలోని చిగిచెర్ల గ్రామంలో ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులతో కలిసి ఆయన అవగాహన కల్పించారు. వేరుశనగ పంటకు ఎకరాకు రూ.480, వరికి ఎకరాకు రూ.638, మామిడికి ఎకరాకు రూ.1800, టమోటా ఎకరాకు రూ.1600 మీసేవ కేంద్రాల్లోగానీ, కామన్‌సర్వీస్ సెంటర్‌కు వెళ్లి బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. అనంతరం బీమాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం గ్రామసమీపంలో ఉన్న కందిపంటను పరిశీలించారు. కార్యక్రమంలో వీహెచ్ఏ భార్గవ్, బీమా కంపెనీ ప్రతినిధి చాంద్‌బాషా, రైతులు రాఘవరెడ్డి, అజయ్, శీల్లా ఆనంద్, జయచంద్రారెడ్డి, గోవిందరెడ్డి, చంద్రాయుడు, నాగరాజు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఏఓ, రైతులు

రైల్వే భద్రతపై దృష్టి సారించండి



రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ చీఫ్ రైల్వేసేఫ్టీ అధికారి

ధర్మవరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రైల్వే భద్రత, ప్రయాణీకుల సురక్షిత పట్ల ప్రతిఒక్క అధికారీ ప్రత్యేక దృష్టి సారించాలని ప్రిన్సిపల్ రైల్వేసేఫ్టీ అధికారి వెంకటరమణారెడ్డి సూచించారు. గురువారం ధర్మవరం రైల్వేస్టేషన్, వివిధ విభాగాల కార్యాలయాలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ప్రమాదాల రిలీఫ్ ట్రైన్, మెడికల్ రిలీఫ్ ట్రైన్‌ను పరిశీలించారు. ప్రమాదాలు జరిగినపుడు వెంటనే ఆదుకునేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. గొల్లపల్లి రైల్వే గేటును తనిఖీ చేస్తూ అక్కడ గేట్‌మెన్‌కు తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్షించారు. ఆయన వెంట గుంతకల్లు ఏడీఆర్ఎం సుధాకర్, చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ రవిచంద్రన్, స్టేషన్ మాస్టర్ నరసింహనాయుడు, ఆర్పీఎఫ్‌సీఐ బోయకుమార్ ఉన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

ధర్మవరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో అంబేడ్కర్‌ను కించపరిచేలా మాట్లాడిన కేంద్రహోం మంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నరేశ్ యనమల డిమాండ్‌చేశారు. గురువారం స్థానిక కళాజ్యోతి సర్కిల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసిన ఆయన మాట్లాడారు. అంబేద్కర్ గురించి పార్లమెంట్‌సాక్షిగా అహంకారపూరితంగా అమిత్ షా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు కలీం, రంగనాథ్, జాఫర్, ఎన్ఎస్‌యూఐ నాయకులు చైతన్యఅశోక్, శివ పాల్గొన్నారు.

పరీక్షా పేపర్లను ప్రభుత్వమే సరఫరా చేయాలి



ఎమ్మార్సీ వద్ద ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

కదిరి అర్బన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పరీక్షా పేపర్లను ప్రభుత్వమే పాఠశాలలకు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టిన వారు మాట్లాడారు. చిత్తూరు జిల్లా పూతలపట్టు పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు సిద్దయ్యశెట్టి పరీక్షా పేపర్లు పాఠశాలకు తీసుకెళ్తుతూ ప్రమాదానికి గురై మరణించాడన్నారు. దీనికి ఎవరూ బాధ్యత వహిస్తారన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వమే పాఠశాలలకు పరీక్షల పేపర్లు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు జయచంద్రారెడ్డి, శ్రీనివాసులు, సిద్ధారెడ్డి, నారాయణస్వామి, అనిల్‌కుమార్, రవివర్ధన్‌రెడ్డి, నజీర్ పాల్గొన్నారు.

పాపాగ్ని నీటిని సద్వినియోగం చేసుకోండి



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

నంబులపూలకుంట, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పాపాగ్ని నది నీటిని సాగుకు వాడుకుంటూ సద్వినియోగం చేసుకోవాలని వక్తలు పేర్కొన్నారు. గురువారం మండలంలోని పెడబల్లి జలశయం సమీపంలోని పాపాగ్ని పిలుపు పేరుతో స్వచ్ఛంధ సంస్థలు నిర్వహించిన కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఏపీడీ రమేష్‌బాబు, ఏపీఓ చంద్రశేఖర్ మాట్లాడారు. కర్ణాటక రాష్ట్రంలోని నందిహిల్స్ కలవారికొండలో పుట్టిన పాపాగ్ని... మన రాష్ట్రంలోని తనకల్లు మండలంలోని సీజీ ప్రాజెక్టు, ఎన్పీకుంటలోని పెడబల్లి జలాశయం, అన్నమయ్య జిల్లాలోని వెలిగల్లు ప్రాజెక్టు, గండి మీదుగా కడప జిల్లా కలాపురం సమీపంలోని పెన్నానదిలో కలుస్తోందన్నారు. ఈ నది పరీవాహక ప్రాంతాల్లోని గ్రామీణ రైతులు ఈ నది నీటితో పంటలు సాగు చేసుకొని.. ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని సూచించారు. అంతేకాకుండా అడవుల సంరక్షణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వెంకటరమణారెడ్డి, విష్ణుమూర్తి, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, రైతుల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

హెల్త్ సెంటర్ తనిఖీ

నల్లచెరువు, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓరువాయి, పంతులచెరువు గ్రామాల్లోని హెల్త్ సెంటర్లను జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగేంద్ర గురువారం తనిఖీ చేశారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై ఆరా తీశారు. అందులో భాగంగా రికార్డు అయిన రోగుల వివరాలు, మలేరియా, డెంగీ, బీపీ, షుగర్ కేసులను పరిశీలించారు. అలాగే పంతులచెరువు ఉపకేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట వైద్యాధికారి కల్పన, సీహెచ్ఓ రామచంద్రారెడ్డి, ఆరోగ్య సహాయకులు ముస్తఫా, ఏఎన్ఎంలు రోజామణి, ఎంఎల్‌హెచ్‌పీలు తస్లింబాను, శాంతకుమారి, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

క్రైం న్యూస్ ..

మేడపై నుంచి పడి వ్యక్తి మృతి

నల్లమాడ డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానికంగా నివాసముం టున్న ప్రైవేట్ డ్రైవర్ షామీర్ (45) ప్రమాదవశాత్తు రెండో అంతస్థు నుంచి కిందపడి గురువారం రాత్రి మరణించాడు. తన ఇంటిలోని రెండో అంతస్థులోకి వాషింగ్ మిషన్ తీసుకొని వెళ్తుండగా.. పొరపాటున కాలు జారి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ అతన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మరణించాడు. షామీర్‌కు భార్య షబానా, ఓ కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.



షామీర్ (ఫైల్)

యువతి అదృశ్యం

కదిరి, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ కాలనీకి చెందిన యువతి అదృశ్యమైనట్లు ఆమె తల్లి గురువారం ఫిర్యాదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. పట్టణానికి చెందిన 19 యేళ్ల బాలికను ఆమె బంధువుల అబ్బాయికి ఇచ్చి పెళ్లి చేయడానికి నిశ్చయించారు. ఈనెల 18న ఓ తోటలో నలుగు కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. అదేరోజు సాయంత్రం ఆ యువతి కనిపించకుండా పోయింది. అందుకు కారణం పట్టణంలోని మునివర్ధన్, వరప్రసాద్, పవన్‌లే కారణమని అనుమానం వ్యక్తం చేస్తూ ఆ బాలిక తల్లి పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ చోరీ

కదిరి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని సున్నంపుగుట్ట తండాకు చెందిన నీలాబాయి, ఆమె భర్త 20 రోజుల క్రితం స్థానిక మైనార్టీ ఫంక్షన్ హాల్ వద్దకు వచ్చారు. తమ స్కూటీని అక్కడ ఉంచి పనిమీద వెళ్లారు. తిరిగి వచ్చి చూడగా స్కూటీ కనిపించలేదు. గాలించినా ఫలితం లేకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

తోటి విద్యార్థి దాడి

బత్తలపల్లి డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడేకండ్ల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి విద్యార్థి ప్రణీత్ కుమార్‌పై అదే పాఠశాలలోని మరో విద్యార్థి రాళ్లతో గురువారం దాడి చేశాడు. దీంతో ప్రణీత్ ఎడమ చేయి వేలు విరిగిందని ఆ బాలుడి తండ్రి బాలు తెలిపాడు. ప్రణీత్‌కు బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రితో చికిత్స చేయించామన్నారు. విద్యార్థులు రాళ్లతో దాడి చేస్తున్నా.. టీచర్లు ఎందుకు అడ్డుకోలేకపోయారని వాపోయారు.

ఆస్పత్రిలో సిబ్బంది వాగ్వాదం



ఆసుపత్రిలో వాగ్వాదానికి దిగిన వైద్య సిబ్బంది

నంబులపూలకుంట, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ఆసుపత్రికి వచ్చిన రోగికి చికిత్స విషయంలో వైద్య సిబ్బంది వాగ్వివాదం చేసుకున్న సంఘట గురువారం చోటు చేసుకుంది. మండలంలోని దిగువ తూపల్లికి చెందిన శివప్ప డయేరియాతో ప్రభుత్వ ఆసుప్రతికి గురువారం ఉదయం 8.30గంటలకు వచ్చారు. ఆసుపత్రి ఆవరణంలోనే సొమ్మసిల్లి పడిపోయారు. మరో రోగి అతన్ని తీసుకెళ్లి ఆసుపత్రిలో చేరిపించాడు. స్టాఫ్ నర్సు వెంటనే శివప్పకు మందులు ఇచ్చారు. డయేరియా అధికం కావడంతో అతనికి సెలైన్ పెట్టాల్సి వచ్చింది. రోగి వెంట ఎవరూ లేకపోవడంతో, అనాథ కావడంతో రోగికి సెలైన్ ఎక్కిచడానికి స్టాఫ్ నర్సు వెనుకడుగు వేసింది. ఆ సమయంలో వైద్యశాలకు వచ్చిన సూపర్‌వైజర్ మహేశ్వరరెడ్డి ఆ రోగి తనకు తెలుసునని.. ఏ సమస్య వచ్చినా తాను పూచీగా ఉంటానని, సెలైన్ ఎక్కించాలని స్టాఫ్ నర్సుకు సూచించారు. తనకు చెప్పడానికి మీరెవరు.. అంటూ స్టాఫ్ నర్సు వాదించడంతో సూపర్‌వైజర్ మండల వైద్యాధికారి ఆనందవర్ధన్ ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడానికి ప్రయత్నించాడు. అతని అందుబాటులోకి రాలేదు. దీంతో మహేశ్వరరెడ్డి సమస్యను డీఏఓ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు స్టాఫ్‌నర్స్ ఆ రోగికి సెలైన్ పెట్టింది. అనంతరం ఆసుపత్రికి వచ్చిన మండల వైద్యాధికారి ఆనందవర్ధన్ తన ప్రమేయం లేకుండా ఉన్నతాధికారులతో ఎందుకు మాట్లాడారంటూ సూపర్‌వైజర్‌తో వాగ్వివాదానికి దిగారు. ఆ సమయంలో విధులకు సరిగా రావడం లేదంటూ ఒకరిపై ఒకరు తీవ్రస్థాయిలో దూషించుకున్నారు.

మిత్రుడికి చేయూత

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పగడాలపల్లికి చెందిన కొమ్మిరి అక్కులప్ప అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇతను మండలంలోని గౌనిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-06లో పదో తరగతి చదివాడు. ఇతని ఆరోగ్య విషయం తెలుసుకున్న నాటి మిత్రులు రూ.11 వేలు ఆర్థిక సాయాన్ని గురువారం అందించారు.

న్యూస్ బాక్స్

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించండి


సభ్యత్వ నమోదులో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు

పరిగి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీటీఎఫ్ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు కోడూరు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం మండల వ్యాప్తంగా ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొన్నారు. అయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు అందాల్సిన బకాయిలు, ప్రావిడెంట్‌ఫండ్‌లు, ఏపీజీఎల్‌ఐ సంబంధిత సెలవులు, నగదు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కార్యదర్శి అంజినమూర్తి, శివన్న, నరసింహారెడ్డి, కృష్ణానాయక్, వెంకటేశ్, రంగస్వామి పాల్గొన్నారు.

ఘనంగా ఏపీసీపీఎస్‌ఈఏ వారోత్సవాలు


నిరసన తెలుపుతున్న ఏపీసీపీఎస్‌ఈఏ నాయకులు

సోమందేపల్లి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాఠశాలల్లో గురువారం ఏపీసీపీఎస్‌ఈఏ ఆవిర్భావ వారోత్సవాలను నాయకులు ఘనంగా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ మాట్లాడుతూ సీపీఎస్ రద్దు అయ్యేందుకు అందరూ కలిసికట్టుగా పోరాడి ఓపీఎస్‌ను సాధించుకుందామన్నారు. సీపీఎస్‌కు పరిష్కారం చూపుతామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చి పట్టించుకోలేదన్నారు. జిల్లా నాయకులు రమేష్‌కుమార్, చంద్రశేఖర్, సజ్జరాయప్ప, గణేష్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హిందూముస్లిం సోదర దినోత్సవం


ప్రసంశాపత్రాలతో విద్యార్థులు

హిందూపురం అర్బన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): హిందూ ముస్లిం సోదర దినోత్సవాన్ని స్థానిక ఇఖ్రా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. గురువారం టిప్పుసుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ అఖీబ్ పాల్గొన్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. భారతదేశంలోని హిందూ ముస్లింలు సోదరభావంతో జీవిస్తున్నారన్నారు. అనంతరం మతసామరస్యం, పరమత సహనంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ప్రశంసాపత్రాలు అందించి, అభినందించారు.

అర్జీలన్నింటినీ పరిష్కరిస్తాం: తహసీల్దార్




మాట్లాడుతున్న తహసీల్దార్ షెక్షావలి

రొళ్ల, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు ఇచ్చిన అన్ని అర్జీలను వెంటనే పరిష్కరిస్తామని తహసీల్దార్ షెక్షావలి అన్నారు. మండలంలోని ఎం.రాయాపురంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. టీఎన్‌టీయూసీ నాయకులు గురుమూర్తి, సిద్దగంగప్ప, రామచంద్రప్ప, బిళియన్న, ఆర్ఐలు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు. మండలంలోని మల్లిమడుగు సచివాలయంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్, వీఆర్వో తెలిపారు.

లేపాక్షి: భూసమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పంచాయతీలోనూ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దార్ సౌజన్యలక్ష్మి అన్నారు. గురువారం కోడిపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మ్యూటేషన్ 5, సర్వే 3, క్యాస్ట్ 4, ఫ్యామిలీ సర్టిఫికెట్ ఒక వినతి అందినట్లు తెలిపారు. వెంటనే వాటిని పరిష్కరిస్తామన్నారు.

సచివాలయ భవనానికి మరమ్మతులు చేపట్టండి


పెచ్చులూడుతున్న సచివాలయ భవనం

అగళి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పి. బ్యాడిగెర గ్రామ సచివాలయం శిథిలావస్థకు చేరుతుందని మరమ్మతులు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. వర్షం వచ్చినప్పుడు జలమయంగా ఉంటుందని పైకప్పు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని వారు తెలిపారు. గతంలో నిర్మించిన పాత గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సచివాలయంగా మార్చుకున్నారన్నారు. వర్షం వస్తే కంప్యూటర్లు, ఫర్నిచర్ దెబ్బతింటున్నాయని వారు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సచివాలయ భవనానికి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బేతేలు చర్చి వీధిలో నివాసముంటున్న చందన అనే మహిళ యాసిడ్ తాగి గురువారం ఆత్మహత్యకు యత్నించింది. శ్రీనివాసులు, చందన దంపతుల మధ్య కుటుంబ కలహాల కారణంగా మనస్తాపానికి గురైన ఆమె యాసిడ్ తాగింది. వెంటనే కుటుంబ సభ్యులు గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్సలు అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం ఆసుపత్రికి తరలించారు. ఘటనపై ఆస్పత్రి వర్గాలు సమాచారం ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు.

గుంతల వంతెన..!

● ఇబ్బంది పడుతున్న వాహనదారులు
● పట్టించుకోని అధికారులు

గోరంట్ల, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో చిత్రావతి నదిపై నిర్మించిన వంతెన పనులు నాసిరంగా ఉండడంతో పెచ్చులుండి గుంతలు ఏర్పడ్డాయి. ఇనుప కడ్డీలు బయటపడడంతో ప్రమాదకరంగా మారింది. గతంలో టీడీపీ అధికారంలో ఉండగా సీఎస్ఆర్ నిధులతో వంతెన నిర్మాణం చేపట్టారు. గత వైసీపీ పాలనలో వంతెన పనులు పూర్తిచేసి, అప్పటి రోడ్లు భవనాల శాఖ మంత్రి మాలగుండ్ల శంకర్‌నారాయణ 2022లో మార్చి 6న హడావుడిగా ప్రారంభించారు. ఆయన మంత్రి పదవి నుంచి వైదొలుగుతున్న తరుణంలో అధికారులపై ఒత్తిడి తెచ్చి పనులు పూర్తి చేయించారు. వంతెనకు ఇరువైపులా రోడ్డు పక్కన కోతకు గురికాకుండా రాతితో ఫినిషింగ్ పనులు చేయకుండానే ప్రారంభించారు. అప్పట్లో అధికారులు పనులన్నీ పూర్తి చేస్తామని చెప్పారే కానీ ఇంత వరకు ఆ పనులు జరగలేదు. నాసిరకం పనుల కారణంగా గుంతలు ఏర్పడి ఇనుప కడ్డీలు బయట పడడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఇటీవల ఓ ద్విచక్రవాహనానికి ఇనుక కడ్డీ తగిలిన ప్రమాదంలో వ్యక్తి గాయపడ్డాడు. ఇనుప కడ్డీ కారణంగా పాదచారులు కూడా భయభ్రాంతులకు గురవుతున్నారు. చిత్రావతి పాత వంతెనను పట్టించుకోకపోవడంతో రహదారి అధ్వానంగా మారింది. పాత వంతెనను అభివృద్ధి చేస్తే ఎంతో సౌకర్యంగా ఉంటుందని స్థానికులు అంటున్నారు. సంబంధిత అధికారులు కొత్త వంతెనపై గుంతలను సరిచేసి, పాత వంతెనను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.


చిత్రావతి వంతెనపై ఏర్పడిన గుంతలు


ప్రమాదకరంగా ఉన్న ఇనుప కడ్డీలు

రాగి పంట సాగుతో రైతుల ఆర్థికాభివృద్ధి: జేసీ

గుడిబండ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో రైతులు బోరు బావుల కింద రాగిపంట సాగు చేయడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని మోరుబాగల్ గ్రామంలో రాగి పంట సాగుపై రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు బోరుబావుల కింద విరివిగా రాగి పంట సాగు చేయాలన్నారు. పండించిన రాగులను ప్రభుత్వం క్వింటాల్ రూ.4290తో కొనుగోలు చేస్తుందన్నారు. కొనుగోలు చేసిన రాగులను ప్రభుత్వం చౌకధాన్యపు డిపోల ద్వారా కార్డుదారులకు అందిస్తామన్నారు. రైతులు ప్రత్యేక దృష్టి సారించి రబీలో రాగి పంట సాగుచేసి అధిక దిగుబడులు సాధించి వాటిని విక్రయించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం రాగి పంటసాగుపై రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు మడకశిర ఏడీఏ కృష్ణమోహన్, తహసీల్దార్ కరుణాకర్, వ్యవసాయ అధికారి వీరనరేష్, వివిధ శాఖల అధికారులు, నాయకులు పురుషోత్తం, మాజీ ఎంపీటీసీ రాజన్న పాల్గొన్నారు.


రైతులు పండించిన కూరగాయలను పరిశీలిస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలి


పెనుకొండలో మానవహారంగా ఏర్పడిన బహుజన చైతన్య వేదిక సభ్యులు

పెనుకొండ/హిందూపురం అర్బన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాజ్యసభలో అంబేడ్కర్ పట్ల కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ ఆయన మంత్రి పదవితోపాటు పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని బహుజన చైతన్యవేదిక అధ్యక్షుడు శివరామక్రిష్ణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో అంబేడ్కర్‌కు పూలమాలలువేసి నివాళులు అర్పించి మానవహారంగా ఏర్పడ్డారు. ఆయన మాట్లాడుతూ హోంమంత్రి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ కమిటీ సభ్యుడు గంగాధర్, చైతన్యవేదిక గౌరవాధ్యక్షుడు రొద్దం బాబు ప్రసాద్, రాము, రవిప్రసాద్, రామాంజినప్ప, నరసింహులు, కొల్లప్ప, హంటర్ ప్రసాద్, మారుతి, ఎంఎస్ మూర్తి పాల్గొన్నారు.

● అంబేడ్కర్‌ను అవమానించే విధంగా కేంద్ర హోంమంత్రి రాజ్యసభలో అనుచిత వాఖ్యలు చేయడం దారుణమని వివిధ పార్టీల నాయకులు మండిపడ్డారు. మంత్రి అమిత్‌షా మాట్లాడే విధానం యావత్ భారతీయులను కలిచివేసిందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక అనేక రూపాల్లో దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. రాజ్యాంగాన్ని మార్చి మనుధర్మమనే ఒక రాజ్యాంగాన్ని తీసుకురావాలని అమిత్‌షా కుట్ర చేస్తున్నారన్నారు. మంత్రి తన పదవికి రాజీనామా చేసి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎంఎస్ఎఫ్ రవి, ఆర్ఎస్‌పీ శ్రీనివాసులు, ఏపీఆర్ఎస్ నౌషాద్, కాంగ్రెస్ నాయకులు షాహిద్, కలీం, హనుమంతరాయుడు, జియా, అంజి పాల్గొన్నారు.


హిందూపురంలో నిరసన తెలుపుతున్న అఖిలపక్ష నాయకులు

నారసింహుడికి చక్రస్నానం.. వసంతోత్సవం


వసంతోత్సవంలో పాల్గొన్న ఈఓ, అర్చకులు, భక్తులు

మడకశిర రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): భక్తరహళ్ళి నరసింహస్వామి, జిల్లేడగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ముగిసినట్లు దేవదాయశాఖ ఈఓ నరసంహరాజు తెలిపారు. స్వామివారి వసంతోత్సవం, చక్రస్నానం తదితర పూజా కార్యక్రమంలో బ్రహ్మోత్సవాల కమిటీ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారని తెలిపారు. ఉత్సవాలు విజయవంతం కావడానికి సహకరించిన అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే శుక్రవారం ఉదయం స్వామివారి ఆలయహుండీలు లెక్కించనున్నట్లు ఆయన తెలిపారు.

డిజిటల్ మోసాలపై పోలీసులకు ఫిర్యాదు

హిందూపురం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలం తూమకుంట, గోళ్లాపురం పారిశ్రామికవాడలో పనిచేస్తున్న వలస కార్మికులు డిజిటల్ పేమెంట్లతో మోసపోతున్నామని రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. తూముకుంట చెక్‌పోస్టులో రాజ్ ఆన్‌లైన్ పాయింట్‌లో డిజిటల్ పేమెంట్ చేసే వ్యక్తి కొంతకాలంగా వలస కార్మికుల డిపాజిట్ చేయడానికి వస్తే వారి సొమ్ము కాజేస్తున్నారన్నారు. ఇటీవల యూపీకి చెందిన రామ్‌మహేష్ అనే వలస కార్మికుడు రూ.10వేలు నగదు తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు వైద్యం కోసం ఆసుపత్రికి పంపించాడు. కానీ ఆయనవద్ద థంబ్‌వేయించుకుని నగదు జమచేయకుండా రూ.10వేలు ఖాతా నుంచి తీసుకున్నాడని అన్నారు. ఆ తరువాత ఎన్నిరోజులైనా ఆ మొత్తం కుటుంబ సభ్యులకు చేరకపోవడంతో పలుమార్లు ఆన్‌లైన్‌పాయింట్‌వద్దకు వెళ్లి ప్రశ్నించారు. వలస కార్మికుడిపై ఎదురుతిరిగాడు. దీంతో కర్ణాటక చిక్కబళ్లాపురం పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో స్టేట్‌మెంట్ తీసుకొచ్చి తరువాత ఆన్‌లైన్‌షాపు యజమానిని మందలించి డబ్బు వాపసు ఇవ్వాలన్నారు. వీరితోపాటు మరికొంతమంది ఇలాగే పాల్పడుతున్నారని స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నోట్ పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

చిలమత్తూరు, డిశంబరు 19 (ఆంధ్రజ్యోతి): అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం మండల కేంద్రంలో టీడీపీ నాయకులు సేవా కార్యక్రమాలు చేపట్టారు. టీడీపీ నాయకులు నాగేంద్ర ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి రోగులకు పాలు, బ్రెడ్లు అందజేశారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కట్‌చేసి అంబికా లక్ష్మీనారాయణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నరేష్, మూర్తి, పవన్, నాగరాజు, చరణ్, నవీన్, గంగప్ప పాల్గొన్నారు.

వైసీపీకి హైకోర్టులో చుక్కెదురు

జగన్ జన్మదిన వేడుకలకు అనుమతి నిరాకరణ

హిందూపురం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఈనెల 21వ తేదీన పట్టణంలోని ఇందిరమ్మ సర్కిల్‌లో నిర్వహించేందుకు హైకోర్టు అనుమతి నిరాకరించింది. ఐదు రోజుల క్రితం స్థానిక వైసీపీ నాయకులు 21న 3 గంటలపాటు ఇందిరమ్మ సర్కిల్‌లో వెయ్యిమందితో జన్మదిన వేడుకలు జరుపుకుంటామని స్థానిక పోలీసు అధికారులకు అనుమతి కోరారు. ప్రస్తుతం హిందూపురంలో ట్రాఫిక్ సమస్య ఉందని ఇక్కడ జరుపుకోవడానికి వీలులేదని వారి వినతిని తిరస్కరించారు. ఈ పరిస్థితుల్లో వైసీపీ నాయకులు హైకోర్టును ఆశ్రయించారు. పరిశీలించిన న్యాయస్థానం ప్రజాస్వామ్యంలో జన్మదిన వేడుకలు జరుపుకోవడానికి ఎలాంటి ఇబ్బంది లేదని, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా ఇతర ప్రాంతాల్లో జరుపుకోవాలని ఆదేశించినట్లు డీఎస్పీ మహేష్‌కుమార్ తెలిపారు. ఇందిరమ్మ సర్కిల్‌లో జరుపుకోవడానికి వైసీపీ నాయకులు సిద్ధపడుతుండగా హైకోర్టు తీర్పుతో వారి ఆశలు అవిరయ్యాయి.

రెవెన్యూ సదస్సులకు అధికారుల డుమ్మా..!

● తహసీల్దార్, వీఆర్వో మాత్రమే హాజరు
● సమస్యలు పరిష్కారంకాక ప్రజల అవస్థలు

మడకశిర రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం భూ సమస్యలు పరిష్కారం కోసం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులు నీరుగారుతున్నాయి. కొందరు అధికారలు సదస్సులకు డుమ్మా కొడుతుండటంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. భూ సమస్యలు పరిష్కరించేందుకు 6 నుంచి జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం నిర్వహిస్తోంది. సదస్సులో తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వీఆర్వో, మండల సర్వేయర్, రిజిస్ట్రేషన్ శాఖ అధికారిలేక సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని ప్రజలు వాపోతున్నారు. మొదటి రోజు చత్రం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు మాత్రం ప్రభుత్వం కేటాయించిన అన్నీ శాఖల అధికారులు హాజరయ్యారు. అయితే రోజులు గడుస్తున్న కొద్దీ కొన్ని శాఖ అధికారులు సదస్సులకు డుమ్మాకొడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో గురువారం ఆమిదాలగొంది గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ కరుణాకర్, వీఆర్వో రంగనాథ్ మాత్రమే పాల్గొన్నారు. మిగిలిన శాఖల అధికారులు ఎవరూ రాకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తంచేశారు. దీనిపై తహసీల్దార్ కరుణాకర్‌ను వివరణ కోరగా రెవెన్యూ సదస్సులపై ప్రభుత్వం సూచించిన అన్ని శాఖలకు సమాచారం ఇచ్చాం. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సిబ్బంది కొరత ఉండడంతో వారు రాలేకపోయారు.


ఆమిదాలగొందిలో రెవెన్యూ సదస్సులో పాల్గొన్న తహసీల్దార్, వీఆర్వో


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

ప్రజాసమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు ఎంఎస్ రాజు హెచ్చరించారు. గురువారం ఆర్అండ్‌బీ అతిథిగృహంలో మడకశిర నగర పంచాయతీ ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. వార్డులలో అధికార యంత్రాంగం ప్రత్యేక చొరవ తీసుకోవాలని అన్నారు. శుక్రవారం నుంచి రెండు రోజులపాటు మున్సిపాలిటీలోని 60 మంది ఉద్యోగులతో కలిసి ఉదయం 7.30 నుంచి 12.30 గంటల వరకు వార్డులలో తిరిగి సమస్యలు తెలుసుకొంటానన్నారు. ప్రణాళిక బద్ధంగా ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. 10 నుంచి 15 రోజులకు వార్డులలో మంచి నీరు వదులుతున్నారని అనేక ఫిర్యాదులు వస్తున్నాయని మీరు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పారిశుధ్యం, తాగునీటి సమస్యలపై సకాలంలో అధికారులు స్పందించకపోతే శాఖాపరమైన చర్యలు ఎదుర్కోక తప్పదన్నారు. ప్రజల నుంచి వచ్చే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్లులేని ప్రతి పేదవాడికి ఇల్లు మంజూరు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. నగర పంచాయతీ కమిషనర్ రంగస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, జడ్పీటీసీ సభ్యులు ఉమేష్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చీడపీడల నివారణపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్

మడకశిరటౌన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతులకు అందుబాటులో ఉంటూ పంటలకు సోకే చీడపీడలపై అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి వై.వి.సుబ్బారావు, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్ అన్నారు. గురువారం ఎంపీడీఓ సమావేశ భవనంలో రైతు సేవా సిబ్బంది సామర్థ్యం పెంపుపై శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఆర్ఎస్‌కే సిబ్బంది తప్పనిసరిగా ఈపంట నమోదు చేయాలని ఆదేశించారు. వేరుశనగ, మొక్కజొన్న, రాగి, వరి, కంది పంటలలో సమగ్ర ఎరువుల యాజమాన్యం, ప్రకృతి వ్యవసాయ పంటలలో చీడపీడల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. బిందు సేద్యం పరికరాలు జిల్లాలో 30 వేల హెక్టార్లకు మంజూరయ్యాయని, వీటిని అవసరమైన రైతులు సద్వినియోగం చేసుకొనేలా అవగాహన కల్పించాలన్నారు. వనరుల కేంద్రం ఏడీఏ సనావుల్లా, మడకశిర సహాయ వ్యవసాయ సంచాలకులు కృష్ణమీనన్, పట్టుపరిశ్రమ శాఖ ఏడీ రాజు, ఐదు మండలాల వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్ పరిశీలన

పరిగి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శిర, కొడికొండ జాతీయ రహదారి, పరిగి సరిహద్దు ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సీఎన్‌జీ గ్యాస్ ప్రైవేట్ కంపెనీ సంస్థ ఫిల్లింగ్ స్టేషన్‌ను గురువారం జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పరిశీలించారు. ఫిల్లింగ్ స్టేషన్ యాజమాన్యం ఈ యేడాది ఫిబ్రవరిలో అనుమతులకోసం దరఖాస్తుచేసుకోగా అవసరమైన సౌకర్యాలు, వాహనదారులకు ఇబ్బందులు గురికాకుండా ప్రజలకు, ఫిల్లింగ్ స్టేషన్ నుంచి ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ హనీనాసుల్తానా, ఆర్ఐ సిద్దేశ్, పాల్గొన్నారు.

పశువైద్యశిబిరాలను వినియోగించుకోండి


పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ సుధాకర్

మడకశిర రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పాడిరైతులు ఉచిత పశువైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ సూచించారు. గురువారం మండలంలోని బుళ్ళసముద్రం గ్రామంలో పశువుల గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. పశువులకు కృత్రిమ గర్భధారణ పథకంపై రైతులకు ఆయన వివరించారు. ఏడీ అమర్, గోపామిత్రలు, రైతులు పాల్గొన్నారు.

పట్టాదారు పాసుపుస్తకాలు అందించండి


ఇన్‌చార్జి తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

సోమందేపల్లి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని దశాబ్దకాలంగా సాగుచేసుకుంటున్న పేద రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందించాలని సీపీఎం నాయకులు కోరారు. గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతులు సీపీఎం నాయకులతో కలిసి ఇన్‌చార్జి తహసీల్దార్ రెడ్డిశేఖర్‌కు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ 384సర్వే నంబరులోని ప్రభుత్వ భూమిలో పదేళ్లుగా సాగులో ఉన్న రైతులకు ప్రభుత్వ పథకాలు అందడంలేదన్నారు. అర్హులైన వారిని గుర్తించి వెంటనే సాగు హక్కులను కల్పించాలని కోరారు. కేవీపీఎస్ నాయకులు హనుమయ్య, శీనప్ప, ఆటో సుందర, స్రవంతి, రామాంజినమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

హిందూపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పాడిరైతుల సంక్షేమానికి హెరిటేజ్ డెయిరీ ముందుంటుందని ఆ సంస్థ అధ్యక్షుడు సాంబశివరావు అన్నారు. లేపాక్షి మండలం చోళసముద్రం వద్ద హెరిటేజ్ పాలశీతలీకరణ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ 12 రాష్ట్రాల్లో హెరిటేజ్ డెయిరీ ఉందని రోజూ 19 లక్షల లీటర్ల పాలను సేకరిస్తోందన్నారు. సంస్థ లాభాపేక్షతో కాకుండా సేవాపేక్షతో పనిచేస్తుందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర ఇస్తూ సక్రమంగా బిల్లులు చెల్లిస్తున్నామన్నారు. పశువులకు ఇన్సురెన్స్, సబ్సిడీతో పాడి రైతులకు ఉచిత బీమా చేస్తున్నామన్నారు. రైతులతో మమేకమై పాల ఉత్పత్తిదారులకు అవగాహన కల్పించి ఉత్పత్తిని పెంచేలా చర్యలు తీసుకోవాలని స్థానిక సిబ్బందికి సూచించారు. జోనల్ హెడ్ సర్వోత్తంరెడ్డి, ఏరియా మేనేజర్ ఆదినారాయణ, ప్లాంట్ మేనేజర్ బాబు, క్వాలిటీ ఆర్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.